http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

శనివారం 17 అక్టోబర్ 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828



## పిల్లల సోషల్ మీడియా భద్రత

- సోషల్ మీడియా ముప్పు నుంచి పిల్లల రక్షణపై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసు
- పటిష్ఠమైన నియంత్రణ, వయసు నిర్ధారణ ఉండాలని కోరిన పిటిషనర్లు
- ప్రస్తుత చట్టాలు సరిపోవని, పిల్లలపై తీవ్ర ప్రభావం పడుతోందని పిటిషన్‌లో వెల్లడి
- ఆన్‌లైన్ వేధింపులు, మానసిక ఆరోగ్యంపై పిటిషనర్ల ఆందోళన
- తదుపరి విచారణను డిసెంబర్ 3వ తేదీకి వాయిదా వేసిన ధర్మాసనం

# అన్ని విధాలుగా సహకారం



- తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ఆహ్వానం
- తెలంగాణకు మరో దిగ్గజ కంపెనీ..
- సీఎం రేవంత్‌తో హ్యుందాయ్ ప్రతినిధుల భేటీ
- సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమైన హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ప్రతినిధులు
- జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్లతో ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదన
- ఈ కేంద్రం ద్వారా 4,275 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడి
- అనుమతులు వేగంగా జారీ చేయాలని అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్
- తెలంగాణలో కార్ల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని హ్యుందాయ్‌కు ఆహ్వానం

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి రాబోతోంది. ప్రపంచ ప్రసిద్ధ ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్స్ ఇండియా, రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్ల వ్యయంతో అత్యాధునిక రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ద్వారా సుమారు 4,275 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. శుక్రవారం హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ఇంజినీరింగ్ ఎండీ చాంగ్యో చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. ఈ భేటీ సందర్భంగా తమ పెట్టుబడి ప్రణాళికలను సీఎంకు వారు వివరించారు. జహీరాబాద్‌లో నెలకొల్పబోయే ఆర్ అండ్ డీ కేంద్రం స్వరూపం, దాని ద్వారా లభించే ఉపాధి కల్పన వివరాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలియజేశారు. హ్యుందాయ్ - మిగతా3లో



## కొత్త డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్షం ఏర్పాటు చేయండి

- కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష వైఖరిపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- పార్లమెంటులో ప్రవేశపెట్టే ముందు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని పార్టీల అభిప్రాయం తీసుకోవాలని డిమాండ్
- ఆగస్టు 13న వర్షాకాల సమావేశాలను నిరవధికంగా వాయిదా వేసి ఇప్పటికే 64 రోజులు గడిచినా, పార్లమెంట్ ఉభయ సభలను ఇంకా వాయిదా వేయలేదు

## రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం



- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు విపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపణ
- పది నెలల్లో మోదీ సర్కార్ పడిపోతుందని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శ
- 2029 వరకు మోదీ ప్రధానిగా ఉండాలని ప్రజలు తీర్పు ఇచ్చారని వ్యాఖ్య



## ఇది ప్రభుత్వాన్ని మార్చే కుట్ర

- బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్
- అభిజీత్ దీప్కే, నేహా బోరాను కస్టడీలోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు
- విదేశీ శక్తులతో దేశాన్ని అస్థిరపరిచే ప్రయత్నం చేస్తున్నారు
- ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజా తీర్పుతో వస్తుందని వ్యాఖ్య



## బంగ్లాదేశ్ తరహాలో పాలన మార్పునకు కాంగ్రెస్ కుట్ర

- రాహుల్‌పై రాజ్‌నాథ్ సంచలన ఆరోపణలు
- భారత్‌లో బంగ్లాదేశ్ తరహా పాలన మార్పునకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని రాజ్‌నాథ్ ఆరోపణ
- ప్రజాస్వామ్యం పేరుతో దేశంలో అరాచకం సృష్టించాలని చూస్తోందని విమర్శ
- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలపై రక్షణ మంత్రి తీవ్ర వ్యాఖ్యలు
- అధికారం కోసమే రాజ్యాంగ సంస్థలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపణ
- ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీని ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై విమర్శలు

# ఎల్‌నినోతో ఆహార కొరత ముప్పు!

- ప్రతి గింజనూ కాపాడుకోవాలంటున్న నిపుణులు
- రాష్ట్రంలో వరి సాగులో అగ్రస్థానంలో ఉమ్మడి నల్గొండ జిల్లా ఉంటుంది
- తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా అక్కడ ఉత్పత్తి తగ్గింది.
- ఎల్‌నినో కారణంగా తగ్గుతున్న బియ్యం ఉత్పత్తి



హైదరాబాద్

మానవ మనుగడకు గాలి, నీరు ఎంత అవసరమో, ఆహారం కూడా అంతే అవసరం. ఎల్?నినో ప్రభావంతో రాష్ట్రంలో ఈ కీలక వనరుకు కొరత ఏర్పడే అవకాశం కనిపిస్తోంది. ప్రధానంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఇప్పటికే వర్షపాతం తీవ్రంగా లోపించడం వల్ల లక్షలాది ఎకరాల్లో పంట సాగు తగ్గింది. దీని ఫలితంగా రాష్ట్రంలోనే వరి సాగులో అగ్రస్థానంలో ఉండే ఈ ప్రాంతంలో ఇప్పుడు బియ్యం కొరత ఏర్పడే ప్రమాదం పొంచి ఉంది. ఈ పరిస్థితుల దృష్ట్యా ఆహార ధాన్యాలను వృథా చేయకుండా వాటిని సురక్షితమైన పద్ధతుల్లో నిల్వ చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా అక్టోబర్ 16న 'ప్రపంచ ఆహార దినోత్సవం' - మిగతా3లో




## అయోమయంలో భారత విదేశాంగ అధికారులు

- మోదీ కోరుకుంటే నేనే వివరిస్తా
- అమెరికా మంత్రి మార్కో రూబియో భారత పర్యటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- రూబియో ముంబయిలో భారత అధికారులతో సమావేశం
- కానున్న నేపథ్యంలో విదేశాంగ శాఖలోనే గందరగోళం నెలకొంది

# పిల్లల సోషల్ మీడియా భద్రత

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల వల్ల పిల్లలు ఎదుర్కొంటున్న ప్రమాదాల నుంచి వారిని రక్షించేందుకు సమగ్రమైన, పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. ఈ విషయంపై ఈరోజు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు విచారణ చేపట్టింది. 'ది ఎమరాల్డ్ హైట్స్ ఇంటర్నేషనల్ స్కూల్', దాని డైరెక్టర్ సిద్ధార్థ్ సింగ్ గిర్నార్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. సోషల్ మీడియా వాడకానికి కనీస వయసు నిబంధనలు, ఆన్‌లైన్ వేధింపుల నుంచి రక్షణ కల్పించే మార్గదర్శకాలు రూపొందించాలని వారు తమ పిటిషన్‌లో కోరారు. కేంద్ర ప్రభుత్వం, మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, న్యాయ మంత్రిత్వ శాఖ, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఇప్పటికే ఇలాంటి అంశంపై పెండింగ్‌లో ఉన్న మరో కేసుతో ఈ పిటిషన్‌ను ధర్మాసనం జతచేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 3వ



తేదీకి వాయిదా వేసింది. ప్రస్తుతం చాలా సోషల్ మీడియా సంస్థలు 13 ఏళ్ల కనీస వయసును స్వీయ–ధృవీకరణ పద్ధతిలో అమలు చేస్తున్నాయని, ఇది భారతీయ చట్టాల ప్రకారం పిల్లలకు లభించాల్సిన రక్షణకు సరిపోదని పిటిషనర్లు వాదించారు. 2023 నాటి డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ ప్రకారం 18 ఏళ్లలోపు ప్రతి ఒక్కరినీ 'పిల్లలు'గా పరిగణిస్తారని, వారికి అదనపు రక్షణ కల్పించాలని గుర్తుచేశారు. తల్లిదండ్రుల ధృవీకరణతో కూడిన అనుమతి, వారి ప్రవర్తనను ట్రాక్ చేయకుండా ఉండటం, లక్షిత ప్రకటనలపై పరిమితులు వంటివి ఇందులో ఉన్నాయని పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతమున్న చట్టాలు అసంపూర్తిగా ఉన్నాయని, పిల్లల భద్రతకు సంబంధించి వయసు నిర్ధారణ, తల్లిదండ్రుల ప్రమేయం, సోషల్ మీడియా సంస్థల జవాబుదారీతనంపై స్పష్టమైన విధానం లేదని పిటిషన్‌లో ఆరోపించారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు సైబర్‌బుల్లీయింగ్, వేధింపులు, హానికర కంటెంట్, అపరిచితుల నుంచి ప్రమాదకర పరిచయాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక వినియోగం వల్ల నిద్రలేమి, ఏకాగ్రత తగ్గడం, ఆందోళన, ఆత్మన్యూనత, చదువుపై శ్రద్ధ తగ్గడం వంటి సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పిల్లల ఖాతాలకు తప్పనిసరి ప్రైవసీ సెట్టింగ్‌లు, వయసుకు తగిన యాక్సెస్, హానికర కంటెంట్‌పై ఆంక్షలు విధించేలా మార్గదర్శకాలు జారీ చేయాలని పిటిషనర్లు సుప్రీంకోర్టును అభ్యర్థించారు.

# కొత్త డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్షం ఏర్పాటు చేయండి

కొత్త డీలిమిటేషన్ ప్రతిపాదనలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. కొత్త బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టే ముందు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని పార్టీల అభిప్రాయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష వైఖరిపై ఖర్గే తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గతంలో చేసిన విధంగా రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో బలవంతంగా ఆమోదింపజేసుకునే ప్రయత్నం మరోసారి చేయొద్దని ప్రధానిని కోరారు. ఆగస్టు 13న వర్షాకాల సమావేశాలను నిరవధికంగా వాయిదా వేసి ఇప్పటికే 64 రోజులు గడిచినా, పార్లమెంట్ ఉభయ సభలను ఇంకా వాయిదా వేయలేదని లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం కోసం ప్రభుత్వం పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయనుందని వార్తలు వెలువడిన నేపథ్యంలో ఖర్గే లేఖ రాసినట్లు తెలుస్తోంది. "డీలిమిటేషన్‌పై ఏ రాజ్యాంగ సవరణ బిల్లునైనా తీసుకురావడానికి ముందు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నేను మీకు ఏప్రిల్ 11న మొదటిసారిగా లేఖ రాశాను. కానీ, మీరు అలా చేయలేదు. ఆ తర్వాత ఏప్రిల్ 14న అర్ధరాత్రి దాటిన తర్వాత మీరు బిల్లులను బయటపెట్టి ఏప్రిల్ 16న ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 17న లోక్‌సభలో డీలిమిటేషన్‌పై రాజ్యాంగ సవరణ బిల్లుకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించడంలో ప్రభుత్వం విఫలమైంది. ఆ తర్వాత జూలై 16, ఆగస్టు 27న



అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ మళ్లీ లేఖ రాశాను. ఇప్పుడు నేను నాల్గోసారి ఇలా రాస్తున్నాను. పార్లమెంటులో డీలిమిటేషన్‌పై కొత్త ప్రతిపాదనలను ఖరారు చేయడానికి ముందు వాటిపై సవివరంగా చర్చించడానికి దయచేసి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయండి. అన్ని రాజకీయ పార్టీలకు తమలో తాము, ఒకరితో మరొకరు, ఇతర భాగస్వాములందరితో చర్చించుకోవడానికి తగినంత సమయం ఉండాలి. గతంలో మీరు చేసినట్లుగా రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో బలవంతంగా ఆమోదింపజేయడానికి మళ్లీ ప్రయత్నించవద్దు."

**నెలాఖరులో బిల్లులు పెట్టే అవకాశం**

ఇదిలా ఉండగా, ఈ నెలాఖరులో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లుల ఆమోదం కోసం ఈ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై అనేక వార్తలు వెలువడుతున్నా, అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అటు నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లులను వర్షాకాల సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావించింది. అయితే, నీట్ పరీక్షా పత్రాల లీకేజీ వివాదం, సీజేపీ ఆందోళనల వల్ల కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి రావడంతో ఈ ప్రతిపాదనను తాత్కాలికంగా వాయిదా వేసింది. ఇప్పుడు ప్రత్యేక సమావేశాల్లో బిల్లులను ఆమోదించుకోవాలని భావిస్తోంది. అయితే, సర్ ప్రక్రియకు వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగుతోన్న వేళ ఈ బిల్లులు చర్చకు వస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. వాస్తవానికి ఒక రాజ్యాంగ సవరణకు పార్లమెంటులో ప్రత్యేక మెజారిటీ అవసరం ఉంటుంది. లోక్‌సభలో ఎన్డీఏ కూటమికి మెజారిటీ ఉన్నప్పటికీ, రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండు వంతుల సంఖ్యాబలం (సుమారు 360 సీట్లు) వారికి లేదు. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20మంది ఎంపీలు, శివసేన (యూబీటీ)కి చెందిన ఆరుగురు ఎంపీలు అధికార పక్షంలో చేరడంతో ప్రభుత్వ బలం కాస్త పెరిగింది. ఈ బిల్లులకు మరింత మద్దతు కూడగట్టేందుకు కేంద్ర ప్రభుత్వం డీఎంకే (ఐవీఖ) సహా పలు చిన్న పార్టీలతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

# అయోమయంలో భారత విదేశాంగ అధికారులు

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత పర్యటనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. రూబియో ముంబయిలో భారత ప్రభుత్వ అధికారులతో సమావేశం కానున్న విషయంపై విదేశాంగ శాఖ అధికారులకే స్పష్టత లేదని విమర్శించారు. ఆ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ వివరణ ఇవ్వాలని అన్నారు. ఒకవేళ మోదీ కోరుకుంటే తానే వివరిస్తానంటూ ఎక్స్‌లో వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఇటీవల రూబియో పర్యటనకు సంబంధించిన వివరాలను వెల్లడించిన నేపథ్యంలో రాహుల్ పలు వ్యాఖ్యలు చేశారు. వచ్చే వారం ముంబయిలో భారత ప్రభుత్వ అధికారులతో రూబియో సమావేశమవుతారని, ఆ భేటీలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా పాల్గొంటారని భావిస్తున్నట్లు గోర్ తెలిపారు. దీనిపై స్పందించిన రాహుల్, భారత విదేశాంగ శాఖలోనే ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉందంటూ కేంద్రంపై తాజాగా విమర్శలు గుప్పించారు.

**'అధికారులంతా అయోమయంలోనే!'**

మార్కో రూబియో తన ఉద్యోగిని ముంబయికి పిలిపించుకున్నారంటూ రాహుల్ తన పోస్టులో పేర్కొన్నారు. విదేశాంగ శాఖలోని అధికారులు ఏం జరుగుతుందో తెలియక అయోమయంలో ఉన్నారని ప్రధాని మోదీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆ విషయం గురించి మోదీ వివరించాల్సి ఉంటుందని, లేదంటే తానే వివరించాల్సి వస్తుందంటూ సోషల్ మీడియాలో పోస్ట్ ద్వారా ఎద్దేవా చేశారు రాహుల్ గాంధీ.

**'గోర్ ఎందుకు వెల్లడిస్తున్నారు?'**

అయితే రూబియో పర్యటనపై కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే




కేంద్రప్రభుత్వాన్ని ప్రశ్నించింది. భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో రూబియో భేటీ గురించి అమెరికా రాయబారి వివరాలు వెల్లడించడంపై అభ్యంతరం తెలిపింది. ఇలాంటి విషయాలను భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ప్రకటించాల్సి ఉండగా, అమెరికా రాయబారి ఎందుకు వెల్లడిస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రశ్నించారు. భారత విదేశాంగ మంత్రి దేశంలో నిర్వహించే సమావేశాల వివరాలను ఇతరులు ప్రకటించడం అసాధారణమని ఆయన వ్యాఖ్యానించారు. రూబియో ముంబయిలో భారత ప్రభుత్వ అధికారులను కలుస్తారని చెప్పడం ఒకటైతే, ఆ సమావేశానికి జైశంకర్ కూడా వస్తారని అమెరికా రాయబారి ప్రకటించడం మరో విషయమని పేర్కొన్నారు.

**అక్టోబర్ 17 నుంచి 22 వరకు పర్యటన**

బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరంలో జరిగిన చర్చ సందర్భంగా గోర్ ఆ వివరాలను వెల్లడించారు. రూబియో ముంబయిలో భారత ప్రభుత్వ అధికారులతో సమావేశమవుతారని, ఢిల్లీ నుంచి మరికొందరు అధికారులు కూడా అక్కడికి వస్తారని చెప్పారు. జైశంకర్ కూడా ఈ సమావేశంలో పాల్గొంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆ ప్రకటనే ఇప్పుడు కాంగ్రెస్ విమర్శలకు కారణమైంది. అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, రూబియో అక్టోబర్ 17–22 వరకు ఉజ్బెకిస్థాన్, భారత్‌లో పర్యటించనున్నారు.

తొలుత ఉజ్బెకిస్థాన్‌లోని సమర్‌కండ్‌కు వెళ్లి, అక్కడ సెంట్రల్ ఆసియా దేశాలతో జరిగే సీ5ం1 మంత్రుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం భారత్‌కు వచ్చి ముంబయి, గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో పర్యటిస్తారు. భారత్‌లో పర్యటన సందర్భంగా సీనియర్ ప్రభుత్వ అధికారులతో సమావేశమై ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై చర్చించనున్నారు. ఇంధన రంగంలో పరస్పర సహకారాన్ని పెంచుకునే అవకాశాలపైనా చర్చలు జరపనున్నారు. వ్యాపార రంగానికి చెందిన ప్రముఖులతోనూ రూబియో సమావేశమై వాణిజ్యం, పెట్టుబడులకు సంబంధించిన అంశాలపై మాట్లాడనున్నారు.

**వాణిజ్యం, ఇంధన రంగాలపై దృష్టి**

రూబియో పర్యటన రాజకీయ చర్చలకే పరిమితం కాకుండా వ్యాపార సంబంధాలపైనా ప్రధానంగా దృష్టి పెట్టనుంది. భారత్– అమెరికా మధ్య వాణిజ్యం, ఇంధన సహకారం, సాంకేతిక రంగంలో భాగస్వామ్యం, పెట్టుబడుల అవకాశాలు ఆ పర్యటనలో కీలకంగా ఉండనున్నాయి. అమెరికా కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టడం, ఇరు దేశాల మధ్య వ్యాపార సంబంధాలను మరింత విస్తరించడం వంటి అంశాలపై చర్చలు జరిగే అవకాశం ఉంది. ఈ ఏడాది మే 23 నుంచి 26 వరకు రూబియో భారత్‌లో పర్యటించారు. ఇప్పుడు ఆయన చేపట్టనున్న పర్యటన ఈ ఏడాదిలో రెండో అధికారిక పర్యటన కానుంది.

# రోజుకు రూ. 200 కోట్ల నష్టం..
# కన్నాట్ ప్లేస్ బంద్‌పై వ్యాపారుల ఆవేదన

'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ప్రతిపాదించిన 'లెహ్రా దో తిరంగా' నిరసన కార్యక్రమం కారణంగా ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో సెంట్రల్ పార్క్‌ను మూసివేయడాన్ని వ్యతిరేకిస్తూ వ్యాపారులు దాఖలు చేసిన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అయితే, ఈ మూసివేత వల్ల చిన్న వ్యాపారులపై పడే ప్రభావం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ పరిణామంతో తమకు రోజుకు సుమారు రూ. 200 కోట్ల నష్టం వాటిల్లుతోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీ కిరాణా కమిటీ, ఢిల్లీ ఐరన్ అండ్ హార్డ్‌వేర్ మర్చంట్ అసోసియేషన్ ఈ మేరకు పిటిషన్ దాఖలు చేశాయి. పిటిషనర్ల తరఫున న్యాయవాది జై అనంత్ దేహ్‌ద్రాయ్.. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ముందు నేడు వాదనలు వినిపించారు. న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (ఎన్‌డీఎంసీ) అర్ధరాత్రి వేళ పార్క్‌ను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసిందని, పండగ సీజన్‌లో ఈ నిర్ణయం వల్ల వ్యాపార కార్యకలాపాలు స్తంభించిపోయి, తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.



దీనిపై స్పందించిన సీజేఐ సూర్యకాంత్.. "ఈ విషయంలో సంబంధిత వర్గాలన్నింటిలోనూ మంచి ఆలోచన వస్తుందని మేము ఆశిస్తున్నాము. పండగ రోజుల్లో చిన్న దుకాణదారులు తమ జీవనోపాధిని ఎలా సంపాదించుకుంటారో మాకు తెలుసు. వారి కుటుంబాలు ఎదుర్కొనే కష్టాలు, ఇబ్బందులు మాకు అర్థమవుతాయి" అని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో జస్టిస్ బాగ్చీ జోక్యం చేసుకుంటూ.. నిరసన తెలిపే హక్కు, శాంతిభద్రతల పరిరక్షణ, వ్యాపారం చేసుకునే హక్కు పరస్పరం ముడిపడి ఉంటాయని అన్నారు. ఒకవేళ ప్రభుత్వం విధించిన ఆంక్షలు అహేతుకమైనవని, వాటి వల్ల వ్యాపారులకు చట్టవిరుద్ధంగా నష్టం వాటిల్లిందని తర్వాత తేలితే, రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక అధికారాలను ఉపయోగించి కోర్టు నష్టపరిహారం ఇప్పించవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశంపై ఇప్పటికే ఢిల్లీ హైకోర్టులో సంబంధిత పిటిషన్లు విచారణలో ఉన్నాయి. దసరా సెలవుల అనంతరం, అక్టోబర్ 26 లేదా 27 తేదీల్లో ఈ పిటిషన్‌పై విచారణ జరిపే అవకాశం ఉంది.

## ఇది ప్రభుత్వాన్ని మార్చే కుట్ర



కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను, ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు నేహా బోరాను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. ఎలక్టోరల్ రోల్స్‌లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో తలపెట్టిన 'లెహ్రా దో తిరంగా' నిరసన ర్యాలీకి కొద్దిసేపటి ముందు ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ సాయంత్రం 5 గంటలకు సెంట్రల్ పార్క్‌లో నిరసన చేపట్టాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. అయితే, ఈ ర్యాలీకి మున్సిపల్ కౌన్సిల్ నుంచి అనుమతి లేదని, ఆ ప్రాంతంలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత సెక్షన్ 163 అమల్లో ఉందని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలోనే ర్యాలీకి ముందు అభిజీత్ దీప్కేను, నేహా బోరాను కస్టడీలోకి తీసుకున్నారు. ఈ అరెస్టులు రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి. ప్రతిపక్షాలు విదేశీ శక్తులతో కలిసి 'ప్రభుత్వాన్ని మార్చే కుట్ర' (రెజీమ్ ఛేంజ్) పన్నుతున్నాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్ర ఆరోపణలు చేశారు. 'రెజీమ్ ఛేంజ్' వంటి పదాల వాడకంతో ప్రతిపక్షాల అసలు ఎజెండా దేశం ముందు బయటపడిందని.. విదేశీ శక్తులతో కలిసి దేశాన్ని అస్థిరపరిచేందుకు అర్బన్ నక్సల్స్ పన్నిన పన్నాగం ఇది అని ఆయన మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజల తీర్పుతో వస్తుంది కానీ, అరాచకంతో కాదు అని ఆయన హితవు పలికారు. నేతల అరెస్టులు జరిగినప్పటికీ, సుమారు 200 నుంచి 300 మంది నిరసనకారులు కన్నాట్ ప్లేస్‌కు చేరుకుని తమ నిరసనను కొనసాగించారు.

## బంగ్లాదేశ్ తరహాలో
## పాలన మార్పునకు కాంగ్రెస్ కుట్ర..



బంగ్లాదేశ్‌లో జరిగిన తరహాలో భారత్‌లోనూ పాలన మార్పునకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నామనే పేరుతో దేశంలో అరాచకాన్ని సృష్టించేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని, రాజ్యాంగ సంస్థలను దెబ్బతీయడమే వారి లక్ష్యమని విమర్శించారు. శుక్రవారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్, రాహుల్ గాంధీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో ఇటీవలి పరిణామాలు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయని రాజ్‌నాథ్ అన్నారు. యువత శక్తిని దేశ అభివృద్ధికి వినియోగించకుండా, రాజకీయ అస్థిరత సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బంగ్లాదేశ్ తరహాలో పాలన మార్పు తీసుకురావాలని కాంగ్రెస్ నేతలు బహిరంగంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. వారి వ్యాఖ్యలను బట్టి ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరచడమే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోందన్నారు.

**అధికారం కోసమే అరాచకమా?**

ఎన్నికల సంఘం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నామని కాంగ్రెస్ చెబుతున్నా.. అసలు లక్ష్యం అధికారం చేజిక్కించుకోవడమేనని రాజ్‌నాథ్ ఆరోపించారు. 'పాలన మార్పు' వంటి పదాలను ఉపయోగించడం వెనుక ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. రాజకీయ స్వార్థం కోసం దేశ ప్రయోజనాలను పక్కనపెడితే ప్రజాస్వామ్య చర్చలు వాస్తవాల ఆధారంగా కాకుండా మొండివైఖరి, దుష్ప్రచారానికి వేదికగా మారతాయని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యం పేరుతో అరాచకాన్ని సృష్టించడానికి, రాజ్యాంగ సంస్థలపై దాడులకు, దేశాభివృద్ధికి ఆటంకం కలిగించడానికి ఎవరికీ హక్కు లేదని రాహుల్ గాంధీని ఉద్దేశించి అన్నారు. చట్టాలను గౌరవిస్తూ శాంతిభద్రతలను కాపాడుకోవాలని, రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్యాంగ వ్యవస్థలను దెబ్బతీయకూడదని సూచించారు. ప్రజల తీర్పును గౌరవించి, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నామనే పేరుతో రాజకీయ గందరగోళం సృష్టించడం మానుకోవాలని రాహుల్‌కు హితవు పలికారు.

**ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని గుర్తుచేస్తూ..**

కాంగ్రెస్ గతంలోనూ ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను దెబ్బతీసిందని రాజ్‌నాథ్ విమర్శించారు. 1975లో ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ, 1984లో సిక్కులపై జరిగిన హింస, 1990లో కరసేవకుల హత్యలకు సంబంధించిన పరిణామాలను ప్రస్తావించారు. నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ వైఖరిలో మార్పు లేదని ఆరోపించారు. "1975లో ఇందిరాగాంధీ ప్రజాస్వామ్యాన్ని జైల్లో పెట్టారు. ఇప్పుడు రాహుల్ గాంధీ జేబులో రాజ్యాంగాన్ని పెట్టుకుని అరాచకం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు" అని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘాన్ని కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుందని కూడా ఆయన ఆరోపించారు. 1993లో ఎన్నికల కమిషనర్ల నియామకం, అప్పటి ప్రధాన ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్.. ఎన్నికల కమిషనర్ నవీన్ చావ్లాపై చేసిన ఆరోపణలను ప్రస్తావించారు. చావ్లా కాంగ్రెస్ నేతలకు ఎన్నికల సంఘానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని చేరవేశారని శేషన్ ఆరోపించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆయనను తొలగించకుండా కాపాడటమే కాకుండా, తర్వాత ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమించిందని రాజ్‌నాథ్ విమర్శించారు.

## అవును, ప్రభుత్వాన్ని మార్చడమే మా లక్ష్యం
## ప్రశాంత్ భూషణ్ సంచలన వ్యాఖ్యలు

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)కి వ్యతిరేకంగా సాగుతున్న నిరసనల వెనుక అసలు ఉద్దేశం ప్రభుత్వాన్ని మార్చడమేనన్న బీజేపీ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో, సీనియర్ న్యాయవాది, నిరసనకారుల బృంద సభ్యుడు ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ, "అవును, మేము ప్రభుత్వాన్ని మార్చాలనే కోరుకుంటున్నాం" అని చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలతో నిరసనకారుల అంతర్గత ఎజెండా స్పష్టమైందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తీవ్రంగా స్పందించారు. గురువారం సాయంత్రం ఢిల్లీలో ఏఐఎస్ఏ నాయకురాలు నేహా బోరా, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేలతో కలిసి ప్రశాంత్ భూషణ్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. "ప్రభుత్వంపై అసంతృప్తిని వ్యక్తం చేయడం ప్రజాస్వామ్యంలో నేరం కాదు. ఈ పోరాటం ఇప్పుడు నిజంగా ప్రభుత్వాన్ని మార్చడం కోసమే. ప్రభుత్వం ఇలాగే నిరంకుశంగా వ్యవహరిస్తే, కచ్చితంగా వ్యవస్థలో మార్పు వస్తుంది. గతంలో బీజేపీ కూడా అధికార మార్పిడి కోసం ఎన్నో ఉద్యమాలు చేపట్టింది. ఇప్పుడు మేము చేస్తుంటే కుట్ర అని ఆరోపిస్తారా? ఈ నియంతృత్వ వైఖరికి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తున్న సర్కారుపై మా పోరాటం కొనసాగుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. ప్రశాంత్ భూషణ్ వ్యాఖ్యలపై రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ శుక్రవారం లక్నోలో ఘాటుగా స్పందించారు. "అరాచక రాజకీయాల్లో యువతను పావులుగా మార్చాలని నిరసనకారులు కుట్ర పన్నుతున్నారు. బంగ్లాదేశ్ తరహాలో ఇక్కడ కూడా ప్రభుత్వాన్ని కూల్చడమే వారి లక్ష్యం. వారిలో ఒకరు ఈ విషయాన్ని బహిరంగంగానే వెల్లడించారు, దీన్నిబట్టి వారి అసలు ఎజెండా తేటతెల్లమవుతోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ, ఆయన అనుచరులు దేశంలో అశాంతిని రేకెత్తించడం, రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీయడం మానుకోవాలని రాజ్ నాథ్ హితవు పలికారు. మరోవైపు, నిరసనకారుల బృందంలోని నేహా బోరా, బంగ్లాదేశ్‌లో జరిగిన యువజన ఉద్యమం తమకు స్ఫూర్తి అని పేర్కొన్న వీడియోను బీజేపీ ప్రధానాస్త్రంగా మలుచుకుంది.

# లిక్కర్ గ్యాంగ్‌కు నిద్ర లేకుండా చేస్తున్న రజత్ భార్గవ

**హైదరాబాద్ :** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రూ. 3,500 కోట్ల లిక్కర్ కుంభకోణం కేసులోగ్భ్రాంతికర నిజాలు బయటపడ్డాయి. అప్పట్లో ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రజత్ భార్గవ విజయవాడ మేజిస్ట్రేట్ కోర్టు ముందు సెక్షన్ 164 కింద న్యాయమూర్తికి ఇచ్చిన వాంగ్మూలంతో పాటు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణలో సమర్పించిన ఆధారాలు ఈ స్కామ్ వెనుక ఉన్న అసలు సూత్రధారుల గుట్టును రట్టు చేశాయి. లిక్కర్ దందా మొత్తం నాటి ముఖ్యమంత్రి కార్యాలయం నుంచే పకడ్బందీ కుట్ర ప్రకారం సాగిందని ఆయన వెల్లడించిన నిజాలు పాత పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి.2022 ఏప్రిల్‌లోనే మద్యం సరఫరా, బ్రాండ్ల కేటాయింపుల్లో జరుగుతున్న అక్రమాలను ఆయన గుర్తించారు. పాపులర్ బ్రాండ్లను తొక్కేసి, డిమాండ్ లేని నకిలీ, లోకల్ బ్రాండ్లకు అడ్డగోలుగా ఇండెంట్లు పెట్టడంపై నాటి బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డికి, ప్రత్యేక అధికారి సత్యప్రసాద్‌కు ఆయన మెమోలు జారీ చేశారు. అయితే, ఆ మెమోలను వెనక్కి తీసుకోవాలని, సదరు అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోకూడదని అప్పటి సీఎం జగన్ మోహన్ రెడ్డి కోటరీలోని ముఖ్య కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి, ఓఎస్‌డీ కృష్ణమోహన్‌రెడ్డిలు ఆయనపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకొచ్చారు. రజత్ భార్గవ ఆధారాలతో సహా వీటిని దర్యాప్తు సంస్థలకు ఇచ్చారు.ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నించినందుకు రజత్ భార్గవ రెక్కలు విరిచేసేలా సీఎంవో కీలక నిర్ణయాలు తీసుకుంది.



ఎక్సైజ్ స్పెషల్ సీఎస్ పరిధిలో ఉండే ఆర్డర్ ఫర్ సేల్ అధికారాలను ఆయన నుంచి రాత్రికి రాత్రే లాక్కొని, తమకు అనుకూలంగా పనిచేసే కిందిస్థాయి అధికారులకు కట్టబెట్టారు. ప్రసిద్ధ బ్రాండ్ల ఇండెంట్లను మ్యాన్యువల్ విధానంలో మార్చేసి, కమిషన్లు చెల్లించే మద్యం కంపెనీలకే ఆర్డర్లు వెళ్లేలా మాయాజాలం చేశారు. ఈ దందాను సీఎం సమీక్షల్లో రజత్ భార్గవ లేవనెత్తినా, ధనుంజయ్‌రెడ్డి ఆ అంశాలను మినిట్స్‌లో చేర్చకుండా తొక్కిపెట్టేవారని, జగన్ కోటరీ ఆదేశాల మేరకు బెంబేలెత్తించడంతో తాను ఒంటరిగా పోరాడలేక మౌనం వహించాల్సి వచ్చిందని ఆయన వాంగ్మూలంలో పేర్కొన్నారు.మరోగ్భ్రాంతికర విషయం ఏమిటంటే? వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దిగిపోయే ముందు 2019 నుంచి 2024 వరకు జరిగిన నాఈటూ ఆర్డర్ల డేటాను, ప్రభుత్వ రికార్డులను మాయం చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. అప్పటి ఎక్సైజ్ కమిషనర్ వివేక్ యాదవ్‌ను పాత తేదీలతో సంతకాలు చేసి డేటాను ట్యాంపర్ చేయమని సీఎంవో నుంచి ఒత్తిడి తెచ్చారని, ఆయన అంగీకరించకపోవడంతో రజత్ భార్గవపై కూడా ఒత్తిడి పెంచారని తెలుస్తోంది. అయితే, తాము ఈ అక్రమాలకు సహకరించలేదని, దానికి సంబంధించిన రికార్డుల పరంపర ఇప్పటికీ సెక్రటేరియట్ ఫైళ్లలో భద్రంగా ఉందంటూ దానికి సంబంధించిన సాక్ష్యాలను కూడా ఆయన ఈడీ దర్యాప్తు అధికారుల ముందుంచారు.ప్రస్తుతం రజత్ భార్గవ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా ఈడీ, సిట్ విచారణను మరింత వేగవంతం చేశాయి. సీఎంవో స్థాయి నుంచి సాగిన రూ. 3,500 కోట్ల కిక్‌బ్యాక్స్, మనీలాండరింగ్ నెట్‌వర్క్ గుట్టు వీడటంతో నాటి ప్రభుత్వ పెద్దలకు అరెస్టు భయం పట్టుకుంది. ప్రజాధనాన్ని దోచుకుని, జనం ప్రాణాలతో చెలగాటమాడిన లిక్కర్ ముఠా అసలు ముసుగులు త్వరలోనే పూర్తిగా తొలగిపోవడం ఖాయంగా కనిపిస్తోంది.

# కాంగ్రెస్ ఓటు చోరీ సభ సొంత ప్రభుత్వంపైనే అవిశ్వాసమా?

**హైదరాబాద్ :** తెలంగాణ వేదికగా భారీ ఎత్తున ఓటు చోరీ సభను నిర్వహించాలని, దీనికి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం నిర్ణయించింది. కేంద్ర ఎన్నికల సంఘం తీరుకు వ్యతిరేకంగా, దేశంలో ఈవీఎంల దుర్వినియోగం , ఓటర్ల తొలగింపుపై జాతీయ స్థాయిలో సాగిస్తున్న పోరాటంలో భాగంగా హైదరాబాద్‌లో ఈ బహిరంగ సభను ప్లాన్ చేశారు. అయితే, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ గడ్డపై ఈ రకమైన సభను నిర్వహించడం రాజకీయంగా పెద్ద వ్యూహాత్మక తప్పిదమని, ఇది తమ సొంత ప్రభుత్వం సాధించిన ప్రజానుకూల విజయాన్ని తమకు తామే ప్రశ్నించుకోవడం లాంటిదని పొలిటికల్ సర్కిళ్లలో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.గత శాసనసభ ఎన్నికల్లో ఇదే కేంద్ర ఎన్నికల సంఘం పర్యవేక్షణలో, అవే ఈవీఎంల ద్వారా జరిగిన పోలింగ్‌లోనే కదా కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో 64 స్థానాలు సాధించి, పదేళ్ల బిఆర్ఎస్ రహిత పాలనకు తెరదీస్తూ రేవంత్ రెడ్డి నాయకత్వంలో పీఠాన్ని అధిరోహించింది? తాము గెలిచిన రాష్ట్రాల్లో ఎన్నికల ప్రక్రియ అంతా పవిత్రంగా, పారదర్శకంగా జరిగిందని.. ప్రజా తీర్పు వెల్లువెత్తిందని సంబరాలు చేసుకుని, బిజెపి, ఇతర ప్రత్యర్థి పార్టీలు గెలిచిన చోట్ల మాత్రం ఓటు చోరీ జరిగిందని ప్రచారం చేయడం పచ్చి ద్వంద్వ నీతి కాదా అన్న ప్రశ్నవినిపిస్తోంది. సోషల్ మీడియా వేదికల్లోనూ కాంగ్రెస్ పార్టీ తీసుకున్న ఈ నిర్ణయంపై నెటిజన్ల నుంచి, ముఖ్యంగా ప్రతిపక్ష బిఆర్ఎస్, బిజెపి శ్రేణుల నుంచి సెటైర్లు పేలుతున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఇక్కడ ఈవీఎంలు సరిగ్గా పనిచేసి, పక్కనే ఉన్న మహారాష్ట్ర , లోక్‌సభ ఎన్నికల్లో ఫలితాలు తేడా వస్తే ఈవీఎంలలో తప్పు ఉందనడం ఎంతవరకు సమంజసమని నెటిజన్లు నిలదీస్తున్నారు. సొంత రాష్ట్రంలో సభ పెట్టి ఓటు చోరీ అనడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాధించిన విజయంపై కాంగ్రెస్ అధిష్ఠానమే అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు సంకేతాలు వెళ్తున్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో మోదీ ప్రభుత్వాన్ని డిఫెన్స్‌లో పడేసేందుకు చేస్తున్న ఈ పోరాటం.. హైదరాబాద్‌ను వేదికగా చేసుకోవడం వల్ల స్థానిక రాజకీయాల్లో అధికార పార్టీకి తీవ్ర నష్టం చేకూర్చే ప్రమాదం ఉంది.తెలంగాణలో బిఆర్ఎస్ ఇప్పటికే కాంగ్రెస్ హామీల అమలు నిరసనలు తెలుపుతోంది. ఈ సమయంలో కాంగ్రెస్ స్వయంగా ఈవీఎంలు, ఎన్నికల వ్యవస్థపై అనుమానాలు రేకెత్తించేలా సభలు నిర్వహిస్తే కాంగ్రెస్ తీరును బిఆర్ఎస్, బిజెపిలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పక్కా ప్లాన్ చేసుకుంటాయి. ఏదైనా రాజకీయ పోరాటం చేసేటప్పుడు ఆ వేదిక ఎక్కడ ఉందనేది అత్యంత కీలకం. బిజెపి బలంగా ఉన్న గుజరాత్, ఉత్తరప్రదేశ్ లేదా మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఈ ఓటు చోరీ సభలను నిర్వహిస్తే కాంగ్రెస్‌కు రాజకీయంగా లబ్ధి చేకూరేది. కానీ తమ సొంత ప్రభుత్వం కొలువుదీరిన తెలంగాణలో ఈ తరహా సభ పెట్టడం వల్ల.. కాంగ్రెస్ గెలిస్తేనేమో ప్రజాస్వామ్యం గెలిచినట్లు.. ప్రత్యర్థులు గెలిస్తే ఓటు చోరీ జరిగినట్లా? అనే ప్రతిపక్షాల విమర్శలకు కాంగ్రెస్ నేతలు సరైన సమాధానం చెప్పుకోలేని పరిస్థితి నెలకొంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం స్థిరమైన పాలన అందిస్తున్న తరుణంలో, రాహుల్ గాంధీని ఇలాంటి వివాదాస్పద అంశంతో తెలంగాణకు తీసుకురావడం కంటే.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించే వేదికగా మార్చుకుంటే కాంగ్రెస్‌కు ఎక్కువ మేలు జరిగేదని ఆ పార్టీలోని సీనియర్ నేతలే గుసగుసలాడుతున్నారు. జాతీయ స్థాయి రాజకీయ ఎజెండాను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మార్చుకోవడంలో కాంగ్రెస్ మరోసారి తడబడిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.



# పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ వ్యవస్థ

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ప్రజా రవాణాను మరింత సులువుగా, వేగంగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. సిటీలో రవాణా రద్దీని తగ్గించేందుకు మెట్రో, ఎంఎంటీఎస్, ఆర్టీసీ సర్వీసులతో పాటు 'పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్' వ్యవస్థను తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇటీవల లీ అసోసియేట్స్ సంస్థ ఇచ్చిన నివేదికను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఈ ప్రతిపాదిత నాలుగు కారిడార్లలో ఐటీ కారిడార్ పరిధిలోని మూడింటికి ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

రాయదుర్గం – కూకట్‌పల్లి కారిడార్
హైటెక్‌సిటీ – రాయదుర్గం నాలెడ్జి సిటీ కారిడార్
కొండాపూర్ – ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ కారిడార్

ఈ మూడు మార్గాల్లో ప్రయాణించే వారికి ప్రయోజనం చేకూరేలా, ప్రతి కారిడార్‌కు మూడు వేర్వేరు ప్రత్యామ్నాయాలను సూచించాలని ఏజెన్సీని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.నాల్గో కారిడార్‌ను అసెంబ్లీ, లక్డీకాపూల్, సచివాలయం, ట్యాంక్‌బండ్ ప్రాంతాలను కలుపుతూ రూపొందించారు. అయితే, ఈ మార్గంలో కొన్ని సాంకేతిక సవాళ్లు ఉన్నందున, దీనిని రాణిగంజ్ వరకు పొడిగించే సాధ్యాసాధ్యాలపై మరింత లోతుగా అధ్యయనం చేయాలని సీఎం అధికారులకు సూచించారు.పీఆర్‌టీఎస్ (పాడ్ ట్యాక్సీ) నిర్మాణానికి కిలోమీటరుకు సుమారు రూ.120 కోట్ల నుంచి రూ.180 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా. ఈ ప్రాజెక్టులో రెవెన్యూ కంటే ప్రయాణికుల భద్రత, సెఫ్టీకి ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు.పాతబస్తీతో సహా నగరంలోని నాలుగు మెట్రోరైలు కారిడార్ల కోసం హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు అధికారులు జనరల్ కన్సల్టెన్సీ టెండరు గడువు మరోసారి పొడిగించారు. ముందు అక్టోబరు 8 వరకు ఉన్న గడువు ముగిసేనాటికి తగిన స్పందన రాకపోవడంతో, ఈ గడువును ఈ నెల 22వ తేదీకి పొడిగిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.ఈ పీఆర్‌టీ వ్యవస్థ, మెట్రో విస్తరణ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే, భాగ్యనగరంలో ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని ప్రజలు భావిస్తున్నారు.




## ఎల్‌నినోతో ఆహార కొరత ముప్పు!

-మొదటిపేజీ తరువాయి

జరుపుకుంటారు.

**ఆహార వృథాను అరికట్టాలి**

రైతుల కఠోర శ్రమతో పండిన ఆహార ధాన్యాలు రకరకాలుగా వృథా అవుతున్నాయి. ఒకవైపు టన్నుల కొద్దీ ఆహారం వృథా అవుతుంటే నల్గొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ, భువనగిరి వంటి ప్రధాన పట్టణాల్లో ఎంతో మంది పేదలు, అవసరంలో ఉన్న వారు కనీస భోజనం దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. దేశంలో ప్రతి వ్యక్తి సగటున ఏడాదికి 55 కిలోల ఆహారాన్ని వృథా చేస్తున్నారు. సామాజిక కార్యక్రమాలు, వేడుకలు, హోటళ్లలో జరిగే ఆహార వృథాను అరికట్టగలిగితే, ఆకలి చావులను సగానికి పైగా తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో ఆహార వృథా చాలా ఎక్కువగా ఉంది. ఐదు ఏళ్లలోపు పిల్లల మరణాలకు పోషకాహార లోపమే కారణమని ఐసీఎంఆర్ హెచ్చరించింది.

**అప్రమత్తంగా ఉండండి**

ఎల్‌నినో ప్రభావం ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుందని పెద్దవూర రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్? సోమ పవన్ కుమార్ పేర్కొన్నారు. 'ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఆహార ధాన్యాలు, ఇతర ఆహార పదార్థాల వృథాను పూర్తిగా అరికట్టాలి. అందుబాటులో ఉన్న ఆహార ధాన్యాలను సురక్షితమైన పద్ధతుల్లో నిల్వ చేసుకోవడం మంచిది. ముఖ్యంగా ప్రస్తుతం వరి సాగు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో బియ్యాన్ని భద్రపరుచుకోవడం ద్వారా భవిష్యత్తులో తలెత్తే ఆహార కొరతను అధిగమించవచ్చు' అని సూచించారు.

**వర్షపాత వివరాలు**

రాష్ట్రవ్యాప్తంగా చూసుకుంటే ఉమ్మడి నల్గొండ జిల్లాలోనే వర్షపాతం తక్కువగా ఉంది. ఈ గురువారం వరకు చూసుకుంటే నల్గొండలో 326.6 మిల్లీ మీటర్లు కురిసింది. ఇంకా కురవాల్సింది 553.3 మిల్లీమీటర్లు. మొత్తం వర్షపాత లోటు 41 శాతం ఉంది. సూర్యాపేటలో 439.1 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఇంకా 627.4 మిల్లీమీటర్లు కురవాల్సి ఉంది. ఇక్కడ లోటు వర్షపాతం 30 శాతం ఉంది. ఇక యాదాద్రి భువనగిరి జిల్లాలో చూసుకుంటే కురవాల్సిన వర్షం 591.0 మిల్లీమీటర్లు. ప్రస్తుతం కురిసింది 414.5 మిల్లీమీటర్లు. ఇక్కడ 30 శాతం లోటు వర్షపాతం ఉంది.

## అన్ని విధాలుగా సహకారం

-మొదటిపేజీ తరువాయి

ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన అనుమతులను వెంటనే జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదే క్రమంలో, తెలంగాణలో కార్ల తయారీ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేయాలని హ్యుందాయ్ ప్రతినిధులను ఆయన ఆహ్వానించారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అత్యంత అనుకూల వాతావరణం ఉందని, ప్రభుత్వ పరంగా అన్ని రకాల సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు. ఈ భారీ పెట్టుబడితో జహీరాబాద్ ప్రాంతం ఆటోమొబైల్ హబ్‌గా మరింత అభివృద్ధి చెందనుండంటంతో పాటు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు గణనీయంగా మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

**అన్ని విధాలుగా ప్రభుత్వ సహకారం**

రాష్ట్రంలో కార్ల తయారీ పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరిన సీఎం ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరించేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. పరిశ్రమల ఏర్పాటుకు దేశంలో మిగతా ప్రాంతాలతో పోలిస్తే అన్నివిధాలుగా అనుకూలమైన ప్రాంతమని హ్యుందాయ్ బృందానికి రేవంత్‌రెడ్డి వివరించారు. ఫ్యూచర్ ప్రాంతంలో మ్యానుఫ్యాక్చర్ రంగం అభివృద్ధిని సర్కార్ ప్రత్యేకంగా ప్రోత్సహిస్తుందని చెప్పారు.

**తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ఆహ్వానం**

డిసెంబరులో ఫ్యూచర్ సిటీలో జరిగే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని హ్యుందాయ్ బృందాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. తెలంగాణను పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో నిలిపేందుకు, గ్లోబల్ సిటీగా హైదరాబాద్?ను తీర్చిదిద్దేందుకు ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న పలు రకాల చర్యలను ముఖ్యమంత్రి హ్యుందాయ్ ఇండియా ఎండీ చాంగ్యో చోకు వివరించారు. హైదరాబాద్‌ను గ్లోబల్ టెక్ అడ్వాన్స్‌డ్ ఇంజినీరింగ్ కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ విజన్‌లో భాగస్వామ్యం అవుతామని హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ఎండీ సీఎం రేవంత్ రెడ్డికి హామీ ఇచ్చారు.

## రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం

కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలను ఆయన "తాటాకు చప్పుళ్లు"గా అభివర్ణించారు. ప్రజాతీర్పును గౌరవించకుండా, దేశంలో అరాచకాన్ని సృష్టించి ప్రభుత్వాన్ని కూలదోయాలని విపక్షాలు పగటి కలలు కంటున్నాయని ఆయన ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను ప్రతిపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. "పది నెలల్లో మోదీ ప్రభుత్వం కూలిపోతుంది" అంటూ కొన్ని పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన, ఇది ప్రజాతీర్పును అవమానించడమేనని పేర్కొన్నారు. "ప్రధానిగా నరేంద్ర మోదీ 2029 వరకు కొనసాగాలని ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారు. అయితే, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాల్లో ప్రభుత్వాలను మార్చినట్లుగా ఇక్కడ కూడా చేయాలని ప్రతిపక్షాలు దింపుడుకల్లం ఆశలతో ఉన్నాయి. వారి ఆశలు ఎప్పటికీ నెరవేరవు" అని కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రపంచ దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నప్పటికీ, ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం స్థిరంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ పనితీరును చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ చేసే తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదని, తమ ప్రభుత్వం అత్యంత స్థిరంగా ఉందని, పూర్తికాలం కొనసాగుతుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

## ఎన్‌హెచ్-65 ఆరు లైన్ల విస్తరణ పనులకు ముహూర్తం ఫిక్స్.

**హైదరాబాద్ :** హైదరాబాద్ నుంచి విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్?65) విస్తరణకు రంగం సిద్ధమైంది. ఏపీ, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, సరుకు రవాణా వాహనాలకు ఈ జాతీయ రహదారి అత్యంత కీలకం. అయితే, ఈ రహదారిపై రద్దీ రోజురోజుకు పెరుగుతోంది. దీంతో నిత్యం ట్రాఫిక్ జామ్ ల కారణంగా వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా పండుగుల సమయాల్లో హైదరాబాద్ శివారు ప్రాంతాల నుంచి చౌటుప్పల్, నల్గొండ, సూర్యాపేట మీదుగా ఆంధ్రప్రదేశ్ వెళ్లే మార్గంలో రద్దీ విపరీతంగా ఉంటుంది. అంతేకాక ఈ రహదారిపై వాహనాల రాకపోకల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటంతో ప్రమాదాలుసైతం చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నాలుగు లైన్లుగా ఉన్న హైదరాబాద్ ? విజయవాడ జాతీయ రహదారిని ఆరులైన్లుగా విస్తరించేందుకు అనుమతి లభించింది. అయితే, రహదారి విస్తరణ పనులకు ముహూర్తం ఫిక్స్ అయింది.హైదరాబాద్ ? విజయవాడ జాతీయ రహదారి ప్రస్తుతం నాలుగు వరుసలుగా ఉంది. దీనిని ఆరు లైన్ల రహదారిగా అభివృద్ధి చేసేందుకు నిర్ణయించారు. అయితే, ఈ విస్తరణ పనులు 2027 జనవరి నుంచి ప్రారంభించనున్నట్లు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. ఢిల్లీలో సోమవారం ఎన్‌హెచ్ఏఐ ఛైర్మన్ సంతోష్‌కుమార్ యాదవ్, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమై విస్తరణ పనులు, రహదారి భద్రతపై చర్చించారు.రహదారి విస్తరణలో ఆరు ప్రధాన వరుసలతో పాటు సర్వీసు రోడ్లు, జంక్షన్ల మెరుగుదల, సురక్షితంగా రోడ్డు దాటేందుకు అండర్‌పాస్‌లు, అవసరమైన చోట నియంత్రిత ప్రవేశ సదుపాయాలు కీలకంగా మారనున్నాయి. ఇవి పూర్తయితే హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లే ప్రయాణికులతోపాటు సరకు రవాణా రంగానికి కూడా ప్రయోజనం కలగనుంది.

# సంపాదకీయం

## గిగ్ వర్కలుగా మారుతున్న యూత్

ప్రతి సంవత్సరం కొన్ని లక్షలు మంది డ్రిగీ పట్టాలతో బయటికొస్తున్నారు. ఇందులో కొందరు మాత్రమే మంచి ఉద్యోగాలు సాదించి ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారు. కానీ ఇలా డిగ్రీ పట్టా చేతితో పట్టుకొని.. సరైన ఉద్యోగ అవకాశాలు దొరక్కా.. ఎంతో మంది పార్ట్‌టైం జాబ్‌గా ఫుడ్ డెలివరీ జాబ్స్‌కు పరిమితమవుతున్నారు. ఇలాంటి వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది.. మరీ ఇది వారి జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది. కళాశాల నుంచి డిగ్రీ పట్టాతో ప్రతి ఏడాది కొన్ని లక్షల మంది యువత బయటకు వస్తున్నారు. ఇలా బయటకొచ్చిన ఓ గ్రాడ్యుయేట్ ఓ సాధారణ రెజ్యూమెతో ఉద్యోగాల కోసం వెతుక్కుంటూ.. సరైన జాబ్ దొకకా తర్వాతి అడుగు ఎటు వేయాలో తెలియని అయోమయంలో పడిపోతుననారు. చివరికి అద్దె బైక్‌పై ఫుడ్ డెలివరీ చేస్తూ, రోజూవారీ ఖర్చులు వెళ్లదీసుకుంటూ, ఎప్పటికైనా తాను చదివిన చదువుకు తగిన ఉద్యోగం లభిస్తుందనే ఆశతో ఎదురుచూస్తూ జీవితాన్ని గడిపేస్తున్నారు. మన దేశంలో ఏటా లక్షలాది మంది యువతీ, యువకులు ఎదుర్కొంటున్న ఈ చదువు పూర్తి కావడానికి ? సరైన ఉపాధి దొరకడానికి మధ్య ఉండే ఖాళీ వ్యవస్థలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ పరివర్తన కాలాన్ని అనుకోకుండా వదిలేయకుండా, ఒక పద్ధతి ప్రకారం డిజైన్ చేశారు. ముఖ్యంగా జర్మనీలో అమలవుతున్న డ్యూయల్ అప్రెంటిస్‌షిప్ విధానం ప్రపంచానికే రోల్ మోడల్‌గా నిలుస్తోంది. అక్కడ విద్యార్థులు సగం సమయం తరగతి గదిలో, మిగిలిన సగం వాస్తవ పని ప్రదేశంలో గడుపుతూ వేతనం పొందుతారు. సుమారు 8.3 కోట్ల జనాభా ఉన్న జర్మనీలో దాదాపు 13 లక్షల మంది అప్రెంటిస్‌లుగా ఉన్నారు. అంటే వారి మొత్తం జనాభాలో వీరు 1.5 శాతానికి పైగా ఉంటారు.భారత్‌లోనూ దీనికి సమానంగా నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్ ఉంది. కానీ ఇక్కడి గణాంకాలు ఇందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. 140 కోట్లకు పైగా జనాభా ఉన్న మన దేశంలో, 2024?25 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం కింద నమోదైన అప్రెంటిస్‌ల సంఖ్య కేవలం 9.85 లక్షలు మాత్రమే. అంటే జనాభా నిష్పత్తి ప్రకారం చూస్తే జర్మనీ కంటే ఇది దాదాపు 20 రెట్లు తక్కువ.ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. అవకాశాలు లేకపోవడం సమస్య కాదు. అధికారిక నివేదికల ప్రకారం, దేశవ్యాప్తంగా అప్రెంటిస్‌షిప్ పథకం కింద ఏకంగా 70 లక్షలకు పైగా ఖాళీలు భర్తీ కాకుండా మిగిలిపోయాయి. సమస్య ఖాళీల కొరత కాదు, యువత వీటి కోసం దరఖాస్తు చేయకపోవడమే. 2022లో 42.8 లక్షలుగా ఉన్న దరఖాస్తులు, 2025 నాటికి ఏకంగా 4 లక్షలకు పడిపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.చదువు నుంచి కెరీర్‌కు వారధిగా నిలవాల్సిన లక్షలాది పోస్టులను నిరుద్యోగ యువత ఎందుకు ఎంచుకోవడం లేదు? అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే.. దీని వెనుక బలమైన ఆర్థిక కారణాలు కనిపిస్తున్నాయి. అప్రెంటిస్‌షిప్‌లలో సాధారణంగా నెలకు రూ.10,000 నుంచి రూ.15,000 వరకు మాత్రమే స్టైపెండ్ ఇస్తారు. దీనికోసం వేరే నగరాలకు వెళ్లి అక్కడే ఉండాలి.. పైగా ట్రైనింగ్ తర్వాత ఉద్యోగం వస్తుందన్న గ్యారెంటీ ఉండదు. దీంతో చాలా మంది దీనివైపు మొగ్గుచూపట్లేదని నివేదికలు చెబుతున్నారు.అదే సమయంలో దీనికి భిన్నంగా ఫుడ్ డెలివరీ, క్యాబ్ డ్రైవింగ్, రిటైల్ స్టోర్లలో పని వంటి గిగ్ ఉద్యోగాలు వెంటనే డబ్బును అందిస్తున్నాయి. సొంత ఊరిలోనే ఉంటూ పనిచేసుకునే వెసులుబాటు ఉండటం, దీర్ఘకాలిక ఒప్పందాలు లేకపోవడంతో కుటుంబ అవసరాలు తీర్చుకోవాల్సిన యువత అప్రెంటిస్‌షిప్ కంటే గిగ్ పనులకే మొగ్గు చూపుతున్నారు.గిగ్ వర్క్ తాత్కాలిక ఆదాయానికి, ఉపాధికి మంచి మాధ్యమమే అయినప్పటికీ.. ఇది భవిష్యత్తులో అధిక వేతనాలు, స్థిరమైన కెరీర్‌ను ఇచ్చే సర్టిఫైడ్ నైపుణ్యాలను అందించలేదు. అదే క్రమబద్ధమైన అప్రెంటిస్‌షిప్ అయితే తరగతి గది పాఠాలను పరిశ్రమ అవసరాలకు అనుసంధానించే నైపుణ్యాన్ని ఇస్తుంది. కానీ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో శిక్షణ ద్వారా కెరీర్‌ను నిర్మించుకోవడం కంటే, చేతికి వెంటనే డబ్బు తెచ్చిపెట్టే తాత్కాలిక పనుల వైపే భారతీయ యువత అడుగులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.యువత తీసుకుంటున్న ఈ నిర్ణయం వారి ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా సరైనదే కావొచ్చు. కానీ లక్షలాది ఖాళీలు అందుబాటులో ఉన్నా, ఒక క్రమబద్ధమైన శిక్షణా విధానాన్ని యువత ఎందుకు కాదనుకోవాల్సి వస్తుందన్నదే అసలు ప్రశ్న. వ్యవస్థాగత విధానాలు, స్టైపెండ్ స్థాయిలు, భవిష్యత్ ఉద్యోగ భద్రత వంటి అంశాలలో మార్పులు రానంత వరకు ఈ అంతరం ఇలాగే కొనసాగే ప్రమాదం ఉంది.

## తిరగబడిన సింగరేణి



నల్లబంగారంలో మంటలు రగులుతున్నాయి. ఆగ్రహ శిఖరాలు పగులుతున్నాయి. మాటతప్పిన, మడమతిప్పిన సర్కార్‌పై నిప్పురవ్వలు ఎగురుతున్నాయి. తెలంగాణ జీవనాడి తెగించి పోరుకు సిద్ధమవుతున్నది. బొగ్గును తవ్వితీసే చేతులు పిడికిళ్లు ఎత్తుతున్నాయి. సింగరేణి కార్మికలోకం ఏకవ్యక్తిగా రూపుదాల్చి సవాల్ చేస్తున్నది. సింగరేణి సభలో ప్రతిధ్వనించింది కేటీఆర్ గొంతు కాదు, అశేష కార్మికుల పొలికేక. బహువచనం ఏకవచనమైన నినాదం. సమర సన్నద్ధమైన కార్మికలోకం సమరనాదం. గనుల పొరల్లో నుంచి మార్మోగుతున్న ప్రశ్నలు. ఇందుకు సర్కార్ దగ్గర జవాబులు ఉన్నాయా? తెలంగాణ తల్లి సిరులవేణి సింగరేణిలో అలజడికి బీఆర్ఎస్ సభ నిలువుటద్దం పట్టింది. అధికారంలో ఉన్నా లేకున్నా బొగ్గుబాయి గుండెల్లో రెపరెపలాడేది గులాబీ జెండానే అని చాటిచెప్పింది. ఆ అనుబంధం ఈనాటిది కాదు. నాడు తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడినప్పుడు సింగరేణి కేసీఆర్ సైన్యమై కదం తొక్కింది. నేడు కాంగ్రెస్ సర్కార్ మోసాలు, ద్రోహాలతో కలవరపడుతున్న కార్మికులకు 'నేనున్నాను తోడుగా' అని అండగా నిలిచింది బీఆర్ఎస్. రెట్టించిన సమరోత్సాహంతో జూలు విదిల్చింది సింగరేణి. సింహమై గర్జించింది సింగరేణి. ఆ గర్జనకు గొంతు కలిపారు కేటీఆర్. సింగరేణి అంటే చిన్నాచితకా కంపెనీ కాదు. భూగర్భంలో ప్రాణాలను పణంగా పెట్టి బొగ్గును వెలికితీసే కార్మికుల స్వేద శిఖరం. అలాంటి కార్మికుల సమస్యలను సాధారణ ఉద్యోగుల ఫిర్యాదులుగా పరిగణించలేము. వారి భద్రత, వేతనాలు, ఉద్యోగ భద్రత, వైద్య సదుపాయాలు, నివాస వసతులు, కుటుంబాల సంక్షేమం ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ఉండాలి. కానీ అలా ఎందుకు లేదు? ఎన్నికల ముందు ఇచ్చిన అడ్డగోలు హామీలు ఏమయ్యాయి. అవి హామీలు కావు, అర్రాసు పాటలు. ఇంతకు ఇంత ఇస్తామనే మాటలు. అవి కోటలు దాటినా అడుగు మాత్రం ముందుకు కదల్లేదు. కార్మికుల సొంతింటి కల నిజం చేస్తామన్నారు. ప్రతి కార్మికుడికి 250 గజాల ఇంటి స్థలం, 20 లక్షల వడ్డీలేని రుణం ఇస్తామన్నారు. ఇచ్చారా? కారుణ్య నియామకాలాను సరళీకృతం చేస్తామని చెప్పారు. చేశారా? లాభాల్లో మెరుగైన వాటా ఇస్తామన్నారు. ఆచరణలో తగ్గించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కార్మికుల సమస్యలపై గళమెత్తి, అధికారంలోకి వచ్చాక ఆ సమస్యలను అటకెక్కించారు. మోసపోయి గోసపడుతున్న సింగరేణి శ్రామికలోకం తరఫున బీఆర్ఎస్ సభ ప్రశ్నలను సంధించింది. సమాధానాలున్నాయా కాంగ్రెస్ దగ్గర? కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసి, సింగరేణి నిర్వహణను మెరుగుపర్చడం మాట దేవుడెరుగు, అసలు అస్తిత్వానికే ఎసరు తెస్తున్నారు. లెక్కలు నొక్కేసి బొగ్గును బొక్కేస్తున్నారు. మూడేండ్లలో పది వేల కోట్ల సంపద హాంఫట్ అయిపోయిందని విపక్షం ఆరోపిస్తున్నది. కాంగ్రెస్ పాలనలో సింగరేణిలో స్కాములు ఎగసిపడుతున్నా బీజేపీ నోరు మెదపదు. అంతా కాటాకుస్తీ. ఈ దొందూదొందే సింగరేణి నల్లవజ్రాలను అంబానీ, అదానీలకు పప్పుబెల్లాల్లా పంచిపెట్టాలని చూస్తున్నది. ఎట్టిపరిస్థితుల్లో ప్రైవేటీకరణ జరుగనివ్వబోమని గొప్పగా హామీ ఇచ్చిన కాంగ్రెస్ లోపల్లోపల కుట్రలు పన్నుతున్నది. ఆ కుట్రలకు ముసిముసి నవ్వులతో వత్తాసు పలుకుతున్నది బీజేపీ. ఈ దొందూదొందేపై కేటీఆర్ ఎక్కుపెట్టిన విమర్శలపై సమాధానాలు ఉన్నాయా కాంగ్రెస్ దగ్గర? రూ.నాలుగున్నర లక్షల కోట్లు అప్పుచేశామని చెప్తున్న సర్కార్ రూ.60 వేల కోట్లు సింగరేణి బకాయిలు తీర్చలేకపోయింది. కరెంటు ఏమైందంటే బొగ్గు లేదంటున్నారు. బొగ్గు ఏమైందంటే సింగరేణి వైపు వేలెత్తి చూపిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి ఓ రికార్డు. 2025–26లో 58 మిలియన్ టన్నులే. రానురాను పెరగాల్సింది తరిగిపోవడం ఏమిటి? చేతగాని, చేవలేని పాలన ఫలితం కాదా ఇది? రామన్న సంధించిన ఈ ప్రశ్నలకు సమాధానాలు ఉన్నాయా కాంగ్రెస్ దగ్గర? సింగరేణి కార్మికుల ఆందోళనలో అత్యంత కీలకమైన అంశం సంస్థ లాభాల్లో వారి వాటా. సంస్థ అభివృద్ధికి కార్మికుల శ్రమే పునాది అయినప్పుడు, ఆర్థిక ఫలితాల్లో వారికి న్యాయమైన వాటా దక్కాలన్న డిమాండ్‌ను కాదనగలమా? కేసీఆర్‌కు ముందు లాభాల్లో వాటా 16 శాతమే. కేసీఆర్ దానిని 32 శాతానికి పెంచారు. ఒక శాతం ఎక్కువే ఇస్తామన్న కాంగ్రెస్ లాభాలు తగ్గించి చూపి బోనస్‌కు కోత పెడుతున్నది. గత ఏడాది రూ.1.95 లక్షలున్న బోనస్ ఈ ఏడాది రూ.1.53 లక్షలకు తగ్గిపోవడమే అందుకు నిదర్శనం. ఈ దోఖాలపై పోరుగడ్డ సింగరేణి నిలదీస్తున్నది. బరిగీసి సర్కార్‌తో కొట్లాడుతామని అంటున్నారు కేటీఆర్. నిలబడే దమ్మున్నదా కాంగ్రెస్ పాలకులకు?

## విశ్వగురుపై రగులుతున్న ఇన్వెస్టర్లు



దేశ జీడీపీ 7.8 శాతం వృద్ధి రేటు సాధించినట్టు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నెల క్రితం ప్రకటించారు. ఈ వృద్ధి రేటుతో దేశమంతా సంబురపడుతున్నదని గర్వంగా చెప్పారు. వాస్తవానికి ప్రపంచంలో మరే దేశం సాధించని విధంగా 7.8 శాతం వృద్ధి రేటు సాధించి ఉంటే స్టాక్‌మార్కెట్ రాకెట్‌లా దూసుకువెళ్లి ఉండేది. కానీ అలా జరుగలేదు. స్టాక్‌మార్కెట్ పాతాళానికి దూసుకెళ్తున్నది. ఈనెల 8వ తేదీన ఒక్కరోజే రూ.10.20 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. వరుసగా ఎనిమిది వారాల పాటు మార్కెట్ మైనస్‌లో ముగియడం 25 ఏండ్ల క్రితం నాటి రికార్డు. ప్రపంచాన్ని కలవరపెట్టిన కరోనా సమయంలో కూడా మార్కెట్ రెండు నెలల్లోపే కోలుకున్నది. కానీ ఇప్పుడు గత రెండేండ్ల నుంచి మార్కెట్ ఎలాంటి లాభాలు ఇవ్వలేదు. ఈ కాలంలో సెన్సెక్స్ 12.12 శాతం మైనస్‌లో ఉన్నది. నిఫ్టీ 11.01 శాతం మైనస్‌లో ఉన్నది. అంటే రూ.లక్ష పెట్టుబడి పెట్టినవారు రెండేండ్ల తర్వాత రూ.12 వేల నష్టంతో ఉన్నట్టు లెక్క. ఈ రెండేండ్ల కాలంలో సెన్సెక్స్ 9,874 పాయింట్లు నష్టపోతే, నిఫ్టీ 2,750 పాయింట్లు కోల్పోయింది. ప్రపంచంలో చివరికి పాకిస్థాన్ స్టాక్ మార్కెట్ కూడా లాభాల బాటలో ఉండగా మన దేశంలోని స్టాక్ మార్కెట్లు కోలుకోవడం లేదు. ఇజ్రాయెల్ మార్కెట్ లాభాల్లో ఉన్నది. అమెరికా మార్కెట్లు సానుకూలంగానే స్పందిస్తున్నాయి. మన దేశంలో మార్కెట్ పతనానికి ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధం కారణమని పాలకులు నమ్మబలుకుతున్నారు. బయటి కారణాలతోపాటు మన సొంత కారణాలు కూడా మార్కెట్‌ను దెబ్బతీస్తున్నాయి. స్వల్పకాలిక ఆదాయం, దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్ టాక్స్ పెంచడంతో మార్కెట్ నడ్డివిరిచినట్టు అయింది. స్టాక్ మార్కెట్‌లో 13.5 కోట్ల మంది ఇన్వెస్టర్లు, మ్యూచువల్ ఫండ్స్‌లో 5.9 కోట్ల మంది ఇన్వెస్టర్లు ఉన్నారు.

స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేసే వాళ్లు కొందరు మ్యూచువల్ ఫండ్స్‌లో కూడా పెట్టుబడి పెడుతారు. దేశంలో మొత్తం ఇన్వెస్టర్ల సంఖ్య సుమారు 15 కోట్ల మంది అనుకుంటే.. 28.35 కోట్ల మ్యూచువల్ ఫండ్స ఖాతాలు ఉన్నాయి. ఒక వ్యక్తికి ఒకటికి మించి ఖాతాలు ఉండవచ్చు. మధ్యతరగతికి చెందిన వీరంతా గడచిన రెండేండ్ల నుంచి నష్టాల్లోనే కూరుకుపోయారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడానికి ఈ మధ్యతరగతే ప్రధాన పాత్ర పోషించారు. స్టాక్ మార్కెట్‌లో రెండేండ్ల నుంచి నష్టాలు చవిచూస్తున్న ఈ వర్గం ఇప్పుడు అసంతృప్తితో రగిలిపోతున్నారు. మధ్యతరగతి వర్గం 15 కోట్ల మంది అంటే ఎన్నికల్లో ఫలితాలు నిర్ణయించే శక్తి ఉన్న వర్గం.

విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు గత రెండేండ్ల నుంచి నిధుల తరలింపును నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు. 2025లో రూ.1.66 లక్షల కోట్లు, 2026లో అక్టోబర్ నాటికే రూ.2.92 కోట్లు తరలించారు. ఇంకా రెండు నెలల సమయం ఉన్నది. గత సంవత్సరం కన్నా ఈ సారి రెట్టింపు అమ్మకాలు సాగించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు ఈ స్థాయిలో తరలిస్తే నిజానికి స్టాక్ మార్కెట్ పూర్తిగా కుప్పకూలిపోవాలి. హర్షద్ మెహతా సంక్షోభ సమయంలో పడిపోయినట్టు ఇప్పుడు కూడా పడిపోవాలి. మార్కెట్ కొంతవరకు తట్టుకుని నిలబడిందంటే మన యువ ఇన్వెస్టర్లే కారణం. ఐటీతోపాటు వివిధ ఉద్యోగాల్లో ఉన్న యువత భవిష్యత్తు కోసం నెలనెలా సిప్ ద్వారా పెట్టుబడులు పెడుతున్నారు. భవిష్యత్తులో బాగుంటుందనే నమ్మకంతో వారు ఇన్వెస్ట్ చేస్తూ రెండేండ్ల నుంచి నష్టాలు భరిస్తున్నారు. ఇప్పుడు నమ్మకం సన్నగిల్లి వారంతా మార్కెట్ నుంచి తప్పుకొంటే పరిస్థితులు దయనీయంగా మారే అవకాశం ఉన్నది.

2014లో డాలర్‌తో పోలిస్తే ఆ ఏడాది అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఆసియా–పసిఫిక్ టాప్ టెన్ కరెన్సీలో మన రూపాయి మొదటి స్థానంలో నిలిచింది. 2025–26లో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 9.9 శాతం పడిపోయి ఆసియా కరెన్సీలో అత్యంత బలహీనమైనదిగా నిలిచింది. శ్రీలంక, నేపాల్, పాకిస్థాన్ కరెన్సీ కన్నా మన కరెన్సీ బలహీనంగా ఉన్నది. బీజేపీ అభిమానులు మోదీని విశ్వగురు అని ఆకాశానికి ఎత్తేస్తున్నారు. రూపాయి పాతాళంలో పడిపోతుంటే ఆ అభిమానులు మాత్రం విశ్వగురు నినాదాన్ని మాత్రం వదలడం లేదు. పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్ కరెన్సీ కన్నా మన కరెన్సీ బలహీనంగా ఉన్నదని ఎవరైనా అంటే..'అయితే పాకిస్థాన్‌కు పో' అని బీజేపీ అభిమానులు సూచిస్తున్నారు. మన రూపాయి కన్నా అఫ్ఘాన్ రూపాయి విలువ ఎక్కువ. మన రూపాయికి అఫ్ఘాన్ 1 రూపాయి 35 పైసలు సమానం. హైదరాబాద్‌లో ఇప్పుడు కిలో బియ్యం ధర రూ.85 ఉన్నది. సరిగ్గా ఆరు నెలల క్రితం వరకు ఈ ధర రూ.50 వరకు ఉండేది. కేవలం ఆరు నెలల్లో 70 శాతం పెరుగడమంటే.. ఇది గతంలో ఎప్పుడూ కనీవినీ ఎరుగనిది. రైతుల ఆదాయం 2022 నాటికి రెట్టింపు చేస్తామని 2016లో మోదీ బరేలిలో జరిగిన రైతు సభలో హామీ ఇచ్చారు. చెప్పిన గడువు దాటి నాలుగేండ్లు అవుతున్నా రైతుల ఆదాయం రెట్టింపు కాలేదు. కానీ ఆరు నెలల్లోనే బియ్యం ధరలు రెట్టింపు అయ్యాయి. మధ్యతరగతి జీవితాలను సంక్షోభంలోకి నెడుతున్నారు.

ఆహార ధాన్యాలు సంక్షోభాన్ని ఎదుర్కోనున్నాయని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ ఇటీవల ఆందోళన వ్యక్తం చేశారు. ఇందిరాగాంధీ హయాంలో గరీబీ హటావో అని నినాదం ఇచ్చినట్టు కేంద్రంలోని బీజేపీ పాలన మధ్యతరగతిని చాలా వేగంగా పేదలుగా మారుస్తున్నది. దేశంలో 80 కోట్ల మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారంటూ సబ్సిడీ బియ్యం ఇస్తున్నారు. పరిస్థితి ఇలానే ఉంటే పేదల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉన్నది. అసంతృప్తితో యువత ఉద్యమిస్తుంటే..నివారించే మార్గాలపై కేంద్ర పాలకులు దృష్టి పెట్టకుండా అణచివేతపైనే దృష్టి సారిస్తున్నారు. ఇకనైనా ఓటు బ్యాంకు రాజకీయాలను పక్కన పెట్టి ముంచుకొస్తున్న ప్రమాదంపై దృష్టి పెట్టకపోతే దేశం తీవ్రంగా నష్టపోతుంది.

# రైతుల కన్నీళ్లు కనిపించడం లేదా? కాంగ్రెస్ ప్రభుత్వంపై గోలి శ్రీనివాసరెడ్డి ఆగ్రహం!

**ఎండిపోతున్న వరి పంటలను పరిశీలించిన గోలి శ్రీనివాసరెడ్డి, పంట నష్టపోయిన రైతులను గుర్తించి తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి ఎంతో కష్టపడి, పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు కళ్ల ముందే ఎండిపోతుంటే రైతుల ఆవేదన వర్ణనాతీతమని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, పంట నష్టపోయిన రైతులకు తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.కల్వకుర్తి పట్టణ సమీపంలోని వ్యవసాయ పొలాల్లో ఎండిపోతున్న వరి పంటలను శుక్రవారం గోలి శ్రీనివాసరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పొలాల్లో పంటల పరిస్థితిని పరిశీలించి, రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంటల సాగు కోసం పెట్టిన పెట్టుబడులు, ప్రస్తుతం ఎదురవుతున్న ఇబ్బందుల గురించి రైతుల నుంచి వివరాలు సేకరించారు.

### రైతుల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా?

ఈ సందర్భంగా గోలి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, రైతులు ఎన్నో ఆశలతో పంటలు సాగు చేస్తారని, సాగు కోసం అప్పులు చేసి పెట్టుబడులు పెడతారని తెలిపారు. తీరా పంట చేతికొచ్చే సమయంలో నీటి కొరత, ఇతర సమస్యల కారణంగా పంటలు ఎండిపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి, వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.రైతుల కన్నీళ్లు కనిపించడం లేదా? రైతుల కష్టాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టవా?" అని ప్రశ్నిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతోపాటు, ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

### పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

పంటలు ఎండిపోయి నష్టపోతున్న రైతులను అధికారులు గుర్తించాలని, నష్టం వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన రైతులకు తగిన నష్టపరిహారం అందించాలని గోలి శ్రీనివాసరెడ్డి కోరారు. రైతులకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యత అని, వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయకుండా అన్నదాతల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రభుత్వం స్పందించి, పంటలను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చొరవ చూపాలని స్పష్టం చేశారు.రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది

రైతుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలుస్తుందని గోలి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అన్నదాతలకు న్యాయం జరిగే వరకు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ తమ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సింగం విజయ్ గౌడ్, వెల్దండ మండల అధ్యక్షుడు పుట్ట రామిరెడ్డి, కల్వకుర్తి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాలయ్య, కల్వకుర్తి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షాహిద్, వెల్దండ మాజీ వైస్ ఎంపీపీ అనిల్, మాజీ ఎంపీటీసీ నాగులు నాయక్, కాటన్ మిల్ కార్మిక అధ్యక్షుడు సూర్య ప్రకాష్ రావు, కల్వకుర్తి మాజీ కౌన్సిలర్లు తహిరల్లీ, సైదులు, సురేష్, శ్రీను, ఎల్లికల్ సర్పంచ్ కృష్ణయ్య, యంగంపల్లి సర్పంచ్ యాదగిరి రెడ్డి, సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు, జిల్లెల్ల మాజీ ఉపసర్పంచ్ పాండు గౌడ్, మాజీ సర్పంచ్ బలస్వామి, ఉపసర్పంచ్ మున్యా నాయక్, వార్డు సభ్యులు లోకేష్, పరమేష్, శేఖర్, వెంకటయ్య, గుండయ్య, అశోక్, మొగలాల్, బీమయ్య గౌడ్, జిల్లెల్ల బీఆర్ఎస్ వార్డు సభ్యుడు ముత్యాల నరేష్, బీఆర్ఎస్ నాయకులు బన్నీ శ్రీధర్, శివ, శ్రీను, విష్ణు, రామకృష్ణ, కాశయ్య, ఉపసర్పంచ్ కొండలు, మాజీ ఎంపీటీసీలు రాములు, లింగం, మాజీ సర్పంచ్ అంజి నాయక్, వార్డు సభ్యులు సునీత, ఆనంద్, అశోక్, లాలయ్య, జంగయ్య, మాజీ వార్డు సభ్యులు మీసాల రాజు, సందీప్, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సుభాష్, పోలె అశోక్, ప్రభాకర్, అంజి మాస్టర్, జహంగీర్, జంగయ్య, నర్సింహా, సతీష్, సోను తదితర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# ధనలక్ష్మి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన దుర్గామాత

**కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రత్యేక పూజలు చేసిన గోలి శ్రీనివాసరెడ్డి, జూలూరి రమేష్ బాబు**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ధనలక్ష్మి దేవి అలంకరణలో కొలువుదీరిన దుర్గామాతను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి, దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న గోలి శ్రీనివాసరెడ్డి,కి ఉత్సవ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు వారికి తీర్థప్రసాదాలు అందించి సన్మానించారు.ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా గోలి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, దుర్గామాత ఆశీస్సులతో కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో సంతోషం, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

### భక్తిశ్రద్ధలతో నవరాత్రి వేడుకలు

కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. ప్రతిరోజూ అమ్మవారిని వివిధ అలంకరణల్లో దర్శించుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారగా, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ జూలూరి రమేష్ బాబు, కల్మిచర్ల గోపాల్, పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





# కేజీబీవీ పాఠశాలలో ఘనంగా "మన వెల్దండ -- పాదపూజ" కార్యక్రమం

**విద్యార్థుల్లో సంస్కారం, గురువుల పట్ల గౌరవం,**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

వెల్దండ మండలంలోని కేజీబీవీ పాఠశాలలో "మన వెల్దండ -- పాదపూజ" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఐక్యత ఫౌండేషన్ సౌజన్యంతో, వందేమాతరం ఫౌండేషన్, మై విలేజ్ మోడల్ విలేజ్, శ్రుతిలయ కల్చరల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు, ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు, కౌన్సిలర్ పాపిశెట్టి రాము పాల్గొన్నారు.

విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, వివిధ సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే సంస్కారం, క్రమశిక్షణ, గురువుల పట్ల గౌరవం, తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞతాభావం పెంపొందించాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.విద్యతోపాటు మంచి విలువలు అలవర్చుకోవాలి: పాపిశెట్టి రామన్న ఈ సందర్భంగా పాపిశెట్టి రాము మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు జీవితానికి అవసరమైన మంచి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం ఎంతో కష్టపడుతుంటారని, ఉపాధ్యాయులు విద్యాబుద్ధులు నేర్పి విద్యార్థుల అభివృద్ధికి మార్గనిర్దేశం చేస్తారని తెలిపారు. అందువల్ల విద్యార్థులు తల్లిదండ్రులను, గురువులను ఎల్లప్పుడూ గౌరవిస్తూ, వారి ఆశయాలకు అనుగుణంగా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు.సమాజ అభివృద్ధిలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్న ఆయన, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంతోపాటు వారిలో నైతిక విలువలను పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని, మంచి పౌరులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు.

పలువురు ప్రముఖుల హాజరు ఈ కార్యక్రమంలో, గ్రామ సర్పంచ్ యాదమ్మ వెంకటయ్య, గ్రామ పాలకవర్గ సభ్యులు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు వరప్రసాద్ రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్‌కు చెందిన మాధవరెడ్డి, నితిన్ గౌడ్, చిత్తరంజన్ దాస్‌తో పాటు వారి బృందం, రామన్న మిత్రమండలి సభ్యుడు శ్రీను నాయక్, విద్యార్థినుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పత్రికా మిత్రులు తదితరులు పాల్గొన్నారు.విద్యార్థుల్లో సంస్కారం,







## బతుకమ్మ గాట్ మెట్లను పరిశీలించిన నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"**

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని 11వ వార్డులో బతుకమ్మ వేడుకలకు వచ్చే మహిళల సౌకర్యార్థం నిర్మించిన బతుకమ్మ ఘాట్ మెట్లను, అలాగే శ్మశానవాటికలో నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డును నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి స్వయంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా బతుకమ్మ ఆడేందుకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో నిర్మించిన మెట్లను పరిశీలించారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, మహిళలు పండుగను భక్తిశ్రద్ధలతో, సంతోషంగా జరుపుకునేందుకు అనుకూలమైన వసతులు ఉండాలని పేర్కొన్నారు.

అలాగే 11వ వార్డులోని శ్మశానవాటికలో పూర్తయిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి, స్థానిక ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో ఉండాలని సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ, పట్టణంలోని అన్ని వార్డుల్లో అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్, పండరి రెడ్డి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, తాహెర్ అలీ,బి.రాజు, సుబుర్ మహేష్ చౌహన్, షారూఖాన్,రుక్మిణి గోపాల్ రెడ్డి, విజయ్ బుజ్జి, రామ కృష్ణ మాజీ ఎంపీటీసీ,స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ధనలక్ష్మి అవతారంలో దుర్గామాతకు ఉప్పల వెంకటేష్ దంపతులు ప్రత్యేక పూజలు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి మున్సిపల్ పట్టణంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాల్లో ధనలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్న దుర్గామాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి కల్వకుర్తి పట్టణంలోని పలు దేవాలయాలను సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం, హనుమాన్ దేవాలయం, తిలక్ నగర్‌లోని దుర్గామాత దేవాలయం, పోచమ్మ దేవాలయం వద్ద ఉన్న దుర్గామాత ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఉప్పల వెంకటేష్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ధనలక్ష్మి అవతారంలో కొలువుదీరిన దుర్గామాతకు పూజలు నిర్వహించి భక్తితో మొక్కులు చెల్లించుకున్నారు. దసరా నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని వివిధ అలంకరణల్లో దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివస్తున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో పట్టణంలోని దేవాలయాలు భక్తులతో సందడిగా మారుతున్నాయి. ఈ కార్యక్రమంలో, ఆలయ కమిటీ సభ్యులు , స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు పట్టణ అధ్యక్షుడు బావండ్ల మధు, కాటన్ మిల్ అధ్యక్షుడు సూర్య ప్రకాష్ రావు, సర్పంచ్ రమేష్ గౌడ్, మాజీ సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు గోపాల్ నాయక్ ,బిఆర్ఎస్ నాయకులు, మనోహర్ రెడ్డి, దార మోని గణేష్ , గండికోట రాజు, దాచేపల్లి శీను, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మ ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి..



**అమ్మవారికి పూజలు నిర్వహించిన మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కడ్తాల్ మండల కేంద్రంలో దుర్గామాత మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ సన్నిధిని బీఆర్ఎస్ రాష్ట్ర మీడియా ప్యానలిస్టు, సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నరసింహ రెడ్డి సందర్శించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా లోకకల్యాణం, ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, రాష్ట్ర సుభిక్షం కోసం అమ్మవారికి పూజలు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవాలని కోరారు. దుర్గమ్మ ఆశీస్సులతో వర్షాలు విరివిగా కురవాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. దుర్గామాత కృపతో ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.అనంతరం భక్తులు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్న ప్రసాద వితరణ చేసినట్లు తెలిపారు..ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ గంపా వెంకటేష్ గుప్తా,ఉత్సవ కమిటీ అధ్యక్షులు కరుణాకర్, హనుమాన్ యూత్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి,కంటేకార్ తిరుమలేష్,జగత్ రెడ్డి, రవీందర్ రెడ్డి,మాధారం మహేష్,సాయి ప్రభు,యాదగిరి,శ్యామ్ సుందర్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కరెంటు ఇవ్వలేరు.. నీళ్లు అందించలేరు.. ఇక రైతులకు మీరేం భరోసా ఇస్తారు?

**ఎల్లికల్ సబ్‌స్టేషన్, కేఎల్ఐ కాలువలను పరిశీలించిన గోలి శ్రీనివాస్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు విద్యుత్ కోతలు, సాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయడంతోపాటు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. శుక్రవారం కల్వకుర్తిలో టిఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. అంతకుముందు కల్వకుర్తి మండలం ఎల్లికల్ గ్రామపంచాయతీ పరిధిలోని సబ్‌స్టేషన్‌ను సందర్శించి విద్యుత్ సరఫరా పరిస్థితిని పరిశీలించారు. అలాగే కేఎల్ఐ (కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్) కాలువల్లో నీటి లభ్యతను పరిశీలించి రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలపై ఆరా తీశారు.

### ఒకవైపు కరెంట్ కోతలు.. మరోవైపు సాగునీటి కొరత

ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఒకవైపు విద్యుత్ కోతలు, మరోవైపు సాగునీటి కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతులు పంటలు పండించుకోవాలా? లేక ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాలా? అని ప్రశ్నించారు. వ్యవసాయానికి విద్యుత్, సాగునీరు ఎంతో కీలకమని, ఈ రెండు సౌకర్యాలు సక్రమంగా అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఎల్‌నినో పరిస్థితులను సాకుగా చూపుతూ రైతులకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయకపోవడం సరికాదని విమర్శించారు. వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నా వ్యవసాయ రంగానికి అవసరమైన విద్యుత్ సరఫరా, సాగునీటి నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

### 24 గంటల విద్యుత్ హామీ ఏమైంది?

రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా, సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని గోలి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని సూచించారు. రాష్ట్రంలో పాలనను సమర్థవంతంగా నిర్వహించడంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేయడం తగదని అన్నారు. ఎల్లికల్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా పరిస్థితిని సమీక్షించి, రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

### కేఎల్ఐ కాలువల్లో నీటి లభ్యతపై పరిశీలన

కల్వకుర్తి నియోజకవర్గంలో సాగునీటి పరిస్థితిని తెలుసుకునేందుకు కేఎల్ఐ కాలువలను పరిశీలించినట్లు గోలి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కాలువల ద్వారా రైతులకు అవసరమైన సాగునీరు అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాగునీటి కొరత కారణంగా పంటల సాగుకు ఇబ్బందులు ఎదురైతే రైతుల ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా, సాగునీటి పంపిణీ విషయంలో ప్రభుత్వం సమన్వయంతో పనిచేయాలని, రైతులకు అవసరమైన సమయంలో నీరు అందేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

### రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం

రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని గోలి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. అన్నదాతలను ఇబ్బందులకు గురిచేసే విధానాలను ప్రభుత్వం విడనాడాలని హితవు పలికారు. రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయడంతోపాటు, సాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు బీఆర్ఎస్ పార్టీ వారి పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయకుండా రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మండల బీఆర్ఎస్ పార్టీ



అధ్యక్షుడు సింగం విజయ్ గౌడ్, వెల్దండ మండల అధ్యక్షుడు పుట్ట రామిరెడ్డి, కల్వకుర్తి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాలయ్య, కల్వకుర్తి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షాహిద్, వెల్దండ మాజీ వైస్ ఎంపీపీ అనిల్, మాజీ ఎంపీటీసీ నాగులు నాయక్, కాటన్ మిల్ కార్మిక అధ్యక్షుడు సూర్య ప్రకాష్ రావు, కల్వకుర్తి మాజీ కౌన్సిలర్లు తహిరల్లీ, సైదులు, సురేష్, శ్రీను, ఎల్లికల్ సర్పంచ్ కృష్ణయ్య, యంగంపల్లి సర్పంచ్ యాదగిరి రెడ్డి, సర్పంచ్ బచ్చులకూర శ్రీనివాసులు పాల్గొన్నారు.

అలాగే జిల్లెల్ల మాజీ ఉపసర్పంచ్ పాండు గౌడ్, మాజీ సర్పంచ్ బలస్వామి, ఉపసర్పంచ్ మున్యా నాయక్, వార్డు సభ్యులు లోకేష్, పరమేష్, శేఖర్, వెంకటయ్య, గుండయ్య, అశోక్, మొగలాల్, బీమయ్య గౌడ్, జిల్లెల్ల బీఆర్ఎస్ వార్డు సభ్యుడు ముత్యాల నరేష్, నాయకులు బన్నీ శ్రీధర్, శివ, శ్రీను, విష్ణు, రామకృష్ణ, కాశయ్య, ఉపసర్పంచ్ కొండలు, మాజీ ఎంపీటీసీలు రాములు, లింగం, మాజీ సర్పంచ్ అంజి నాయక్, వార్డు సభ్యులు సునీత, ఆనంద్, అశోక్, లాలయ్య, జంగయ్య, మాజీ వార్డు సభ్యులు మీసాల రాజు, సందీప్, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సుభాష్, పోలె అశోక్, ప్రభాకర్, అంజి మాస్టర్, జహంగీర్, జంగయ్య, నర్సింహా, సతీష్, సోను పాల్గొన్నారు.

# చేర్కూర్‌లో ఘనంగా దుర్గా భవాని నవరాత్రి ఉత్సవాలు



**ప్రత్యేక పూజలు నిర్వహించిన ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

వెల్దండ మండల పరిధిలోని చేర్కూర్ గ్రామంలో దుర్గా భవాని నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి చేర్కూర్ గ్రామానికి చేరుకుని దుర్గా భవాని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. నవరాత్రి ఉత్సవాలు భక్తులలో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

### భక్తిశ్రద్ధలతో నవరాత్రి వేడుకలు

దుర్గా భవాని నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని చేర్కూర్ గ్రామంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పిస్తూ భక్తిని చాటుకుంటున్నారు. గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో ఉత్సవాల్లో పాల్గొంటూ వేడుకలను విజయవంతం చేస్తున్నారు. నవరాత్రి ఉత్సవాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

పలువురు ప్రజాప్రతినిధులు, నాయకుల హాజరు ఈ కార్యక్రమంలో, వెల్దండ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ పుట్టరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, జిల్లా నాయకులు నాగులు నాయక్, సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు, ఉప సర్పంచ్ కొండలు, మాజీ ఎంపీటీసీలు రాములు, లింగం, మాజీ సర్పంచ్ అంజి నాయక్, మాజీ ఉప సర్పంచులు నిరంజన్, నర్సింహా, శ్రీరాములు పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు సునీత, ఆనంద్, అశోక్, లాలయ్య, జంగయ్య, మాజీ వార్డు సభ్యులు మీసాల రాజు, సందీప్, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సుభాష్, పోలె అశోక్, ప్రభాకర్, అంజి మాస్టర్, జహంగీర్, జంగయ్య, నర్సింహా, సతీష్, అనంతరములు, శ్రీను, బుచ్చిబాబు, రవి, కృష్ణ, శ్యాం, మణి, భరత్, శశిధర్, రామచంద్రయ్య, గాండ్ల జంగయ్య, రామరాజు, పరశురాములు, శ్రీకాంత్ రెడ్డి, వంగూర్ లక్ష్మయ్య, వంశీ, శివశంకర్, అభి, శివ, గణేష్, సోను తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులను తక్కువ చేసి మాట్లాడితే సహించేది లేదు..

**విలేకరుల ఆత్మగౌరవం కోసం ఐక్యంగా పోరాడతాం..**
**మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం వ్యాఖ్యలపై జర్నలిస్టుల ఆగ్రహం..**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి: ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తున్న జర్నలిస్టులను కించపరిచేలా మాట్లాడితే సహించేది లేదని జర్నలిస్టులు హెచ్చరించారు. జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర పోషిస్తున్న మీడియా ప్రతినిధులను అవమానించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.

### జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే ఊరుకునేది లేదు

ప్రజా సమస్యలు, ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజాప్రతినిధుల పనితీరును ప్రజల ముందుకు తీసుకెళ్లడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా జర్నలిస్టులు స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కారం లభించేలా వార్తల ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం మీడియా బాధ్యత అని తెలిపారు. అలాంటి బాధ్యతాయుతమైన వృత్తిలో ఉన్న విలేకరులను కించపరిచేలా మాట్లాడటం, వారి వృత్తిని తక్కువ చేసి చూడటం సరికాదని అన్నారు. జర్నలిస్టుల పట్ల గౌరవంతో వ్యవహరించాలని, అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత విమర్శలకు దిగకుండా ప్రజాస్వామ్య పద్ధతుల్లో



స్పందించాలని సూచించారు.

### ఎడ్మ సత్యం వ్యాఖ్యలను ఖండించిన జర్నలిస్టులు..

విలేకరులను అవమానించేలా మాట్లాడిన మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల మనోభావాలు, ఆత్మగౌరవాన్ని దృష్టిలో ఉంచుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు. జర్నలిస్టులను కించపరిచే వ్యాఖ్యలను సాధారణంగా తీసుకోబోమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ఇతర ప్రముఖులు మీడియా ప్రతినిధులతో గౌరవప్రదంగా మెలగాలని పేర్కొన్నారు.

### జర్నలిస్టుల ఐక్యతే బలం

జర్నలిస్టుల ఆత్మగౌరవం, వృత్తి గౌరవాన్ని కాపాడుకోవడానికి అందరూ ఐక్యంగా నిలవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. విలేకరులను అవమానించే వ్యక్తుల తీరుపై సమిష్టిగా నిరసన వ్యక్తం చేస్తామని స్పష్టం చేశారు. జర్నలిస్టుల గౌరవానికి భంగం కలిగించే అంశాలపై ఐక్యంగా స్పందించి, ప్రజాస్వామ్యబద్ధంగా తమ నిరసనను తెలియజేస్తామని తెలిపారు. అలాగే, వ్యక్తులకు సంబంధించిన వార్తల ప్రచురణ విషయంలోనూ జర్నలిస్టులు సమిష్టిగా చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. జర్నలిస్టుల ఆత్మగౌరవం విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర కీలకం ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా స్వేచ్ఛకు, జర్నలిస్టుల వృత్తి గౌరవానికి ప్రత్యేక స్థానం ఉందని జర్నలిస్టులు పేర్కొన్నారు. ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావడానికి మీడియాకు స్వేచ్ఛాయుత వాతావరణం అవసరమని తెలిపారు. జర్నలిస్టులపై వ్యక్తిగత దూషణలకు దిగడం కాకుండా, వార్తలపై అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధమైన, ప్రజాస్వామ్యబద్ధమైన మార్గాల్లో స్పందించాలని సూచించారు. జర్నలిస్టులను అవమానించే వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం బహిరంగ క్షమాపణ చెప్పాలని జర్నలిస్టులు మరోసారి డిమాండ్ చేశారు. జర్నలిస్టుల ఆత్మగౌరవ పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడుతామని హెచ్చరించారు.

# ఐక్యత ఫౌండేషన్ సహకారంతో తాగునీటి ట్యాంకుల శుభ్రత..




**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి: ప్రజలకు పరిశుభ్రమైన, నాణ్యమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన 'స్వచ్ఛ జలధార' కార్యక్రమం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు శిలాపూర్‌లో తాగునీటి నిల్వ ట్యాంకులను శుభ్రపరిచారు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా తాగునీటి పరిశుభ్రతకు ప్రాధాన్యత కల్పించారు. జర్మన్ సాంకేతికతతో ట్యాంకుల శుభ్రత స్వచ్ఛ జలధార' కార్యక్రమంలో భాగంగా జర్మన్ సాంకేతికతతో కూడిన ప్రత్యేక యంత్రాలను ఉపయోగించి తాగునీటి నిల్వ ట్యాంకులను శుభ్రపరిచారు. ట్యాంకుల్లో పేరుకుపోయిన మురికి, వ్యర్థాలను ప్రత్యేక యంత్రాల సహాయంతో తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా తాగునీటి నిల్వ వ్యవస్థలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకున్నారు. తాగునీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరచడం ప్రజారోగ్య పరిరక్షణలో కీలకమని, నీటి నాణ్యతను కాపాడేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

### గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దశలవారీగా కార్యక్రమం

ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ చేపట్టిన 'స్వచ్ఛ జలధార' కార్యక్రమాన్ని కల్వకుర్తి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, ప్రాంతాల్లో దశలవారీగా నిర్వహించనున్నారు. తాగునీటి నిల్వ ట్యాంకుల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు, నీటి నాణ్యతను మెరుగుపరిచేందుకు ఈ కార్యక్రమం దోహదపడనుంది.

ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ ఆధునిక సాంకేతికతతో తాగునీటి ట్యాంకులను శుభ్రపరిచే కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపాలిటీ 6వ వార్డు కౌన్సిలర్ పుట్ట రేణుక రాజశేఖర్, మాజీ కౌన్సిలర్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు శ్రీను నాయక్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడంతోపాటు ఆరోగ్యకరమైన పరిసరాలను ప్రోత్సహించే దిశగా 'స్వచ్ఛ జలధార' కార్యక్రమం కొనసాగుతుండటం విశేషం. ప్రజారోగ్య పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ చేపడుతున్న ఈ కార్యక్రమం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

# తుల్జా భవానీ మాత ఆలయ అభివృద్ధికి 1.20 లక్షల విరాళం

**ప్రత్యేక పూజలు నిర్వహించిన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కడ్తాల్ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ఆలయాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తూ ప్రజాసేవలో ముందుంటున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం వెలుగురాళ్ల తండాలో నిర్వహించిన శ్రీ తుల్జా భవానీ మాత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఆయన హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పెయింటింగ్ పనుల కోసం రూ.1,20,000 ఆర్థిక సహకారాన్ని అందించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు వెలుగురాళ్ల తండాలో శ్రీ తుల్జా భవానీ మాత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకకు హాజరైన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, తండావాసులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీ తుల్జా భవానీ మాత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రజల విశ్వాసాలకు, ఆధ్యాత్మిక భావాలకు ప్రతీకలుగా నిలిచే ఆలయాల అభివృద్ధికి సహకరించడం తనకు సంతృప్తినిస్తుందని పేర్కొన్నారు.

### ఆలయ పెయింటింగ్ పనులకు రూ.1.20 లక్షల సహాయం

వెలుగురాళ్ల తండాలోని శ్రీ తుల్జా భవానీ మాత ఆలయ అభివృద్ధిలో భాగంగా పెయింటింగ్ పనుల నిర్వహణ కోసం



రూ.1,20,000 ఆర్థిక సహకారం అందించినట్లు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. ప్రజలకు ఆధ్యాత్మిక కేంద్రాలుగా నిలిచే ఆలయాల అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని చెప్పారు. ప్రజాసేవతో పాటు ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాల అభివృద్ధికి, ప్రజల విశ్వాసాలకు అనుగుణంగా నిర్వహించే కార్యక్రమాలకు సహకారం అందించడం ద్వారా సామాజిక ఐక్యత మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన తండావాసులు ఆలయ అభివృద్ధికి ఆర్థిక సహకారం అందించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు, వెలుగురాళ్ల తండా ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ పెయింటింగ్ పనులకు ఆయన అందించిన సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ఆయన భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

కర్కల్ పహాడ్‌లోనూ దేవి నవరాత్రి పూజల్లో పాల్గొన్న నాయకుడు వెలుగురాళ్ల తండాలో కార్యక్రమం అనంతరం కడ్తాల్ మండలంలోని కర్కల్ పహాడ్ గ్రామంలో నిర్వహించిన దేవి నవరాత్రి పూజా కార్యక్రమానికి కూడా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరయ్యారు. గ్రామ సర్పంచ్ తేజురాం ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి పూజల్లో పాల్గొని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు సంప్రదాయాలను పరిరక్షించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు ఈ కార్యక్రమశీలో, సర్పంచులు చిట్టి రమేష్, తేజురాం, ఉప సర్పంచ్ పంత్య నాయక్, మాజీ సర్పంచ్ ఇస్లావత్ పాండు, వార్డు సభ్యులు దశరథ్, మోహన్, కిషన్, సీనియర్ నాయకులు ఇస్లావత్ నగేష్, రవి, కిరణ్, సరియా నాయక్, లోక్య నాయక్, జిలానితో పాటు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు ఎగిరిశెట్టి లింగం, రమేష్, మల్లేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# 49వ డివిజన్లో ఇందిరమ్మ చీరల పంపిణీ



**అగ్నిధారన్యూస్ గోదావరిఖని16**

శుక్రవారం రోజున మార్కండేయ కాలనీ 49వ డివిజన్ లో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం డివిజన్ కార్పొరేటర్ సాగి సంతోష్ రావు డివిజన్ ప్రజలకు పంపిణీ చేశారు మున్ముందు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు దసరా శుభాకాంక్షలు తెలిపారు కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మండల విద్యాసాగర్ రెడ్డి సౌజన్య గీత ఉమా తదితరులు పాల్గొన్నారు.

# జూలపల్లిలో ముందస్తు దసరా సంబరాలు

గ్రామ కార్మికులకు పండుగ చీరల పంపిణీ..
సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్,



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలం జూలపల్లి గ్రామంలో ముందస్తు దసరా సంబరాలను నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్, గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామ కార్మికులకు పండుగ చీరలను పంపిణీ చేశారు. పండుగకు ముందుగానే చీరలను అందజేయడంతో కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు.కార్మికుల సేవలకు గుర్తింపుగా చీరల పంపిణీ గ్రామంలో పరిశుభ్రతను కాపాడుతూ, ప్రజలకు నిరంతరం సేవలందిస్తూ, గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులను గౌరవించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పండుగ సమయంలో కార్మికుల కుటుంబాల్లోనూ ఆనందం వెల్లివిరియాలనే లక్ష్యంతో సర్పంచ్, పాలకవర్గ సభ్యులు చీరలను అందజేశారు. గ్రామ పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణతో పాటు ప్రజలకు అవసరమైన సేవలను అందించడంలో గ్రామ కార్మికుల పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. వారి సేవలను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.గ్రామ అభివృద్ధే లక్ష్యం.. కార్మికుల సంక్షేమమే ధ్యేయం గ్రామ అభివృద్ధితో పాటు గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నామని సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్, పాలకవర్గ సభ్యులు తెలిపారు. గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతోపాటు, గ్రామ అభివృద్ధిలో భాగస్వాములవుతున్న కార్మికులను ప్రోత్సహిం చడం అభినందనీయమని పేర్కొన్నారు.రాబోయే దసరా పండుగ ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారో గ్యాలు, సిరిసంపదలు నింపాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలందరూ సంతోషంగా పండుగను జరుపుకోవాలని కోరుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో, జూలపల్లి గ్రామ సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్, ఉపసర్పంచ్ ఇంద్రకంటి శ్రీశైలం గౌడ్, వార్డు సభ్యులు రాఘవేందర్ ముదిరాజ్, అల్లాజీ గౌడ్, జగదీష్ గౌడ్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఏపీఎం రామస్వామి, శ్రీశైలం, రాములు, గ్రామ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి



**నీటి పొదుపు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రజలకు అవగాహన..**
**గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలం పడకల్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎల్ నినో ప్రభావంతో భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో తాగునీటి నిర్వహణ, వర్షపు నీటి సంరక్షణ, వ్యవసాయం, పశుసంరక్షణ తదితర అంశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావం వల్ల వర్షపాతంలో మార్పులు, నీటి కొరత వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని గ్రామస్థులు, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని పేర్కొన్నారు.తాగునీటి సమస్య రాకుండా చర్యలు గ్రామంలో తాగునీటి కొరత ఏర్పడకుండా చేతిపంపులకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, తాగునీటి సరఫరా పైపులైన్లలో లీకేజీలను గుర్తించి వెంటనే అరికట్టాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యం వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని సర్పంచ్ పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ భూముల్లో వ్యవసాయ కుంటలు, నీటిని భూమిలోకి ఇంకించే గుంతలు, సామూహిక నీటి ఇంకుడు నిర్మాణాలు ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చని వివరించారు. వర్షపు నీటిని సమర్థవంతంగా నిల్వ చేసుకుని భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

**ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన**

నీటి కొరత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలు, చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలని తెలిపారు. వ్యవసాయంలో నీటిని పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు, పంటల ఎంపికలో స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్తును కూడా అవసరమైన మేరకే వినియోగిస్తూ పొదుపు పాటించాలని పేర్కొన్నారు.

**పశువుల సంరక్షణకు ముందస్తు ఏర్పాట్లు**

వేసవి కాలంలో పశువులకు పశుగ్రాసం, తాగునీటి కొరత తలెత్తకుండా రైతులు ముందుగానే తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సర్పంచ్ సూచించారు. పశువులకు అవసరమైన పశుగ్రాసాన్ని నిల్వ చేసుకోవడంతో పాటు, నిరంతరం తాగునీటి వసతి కల్పించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు.ముందస్తు ప్రణాళికతోనే ఎల్ నినో సవాళ్లను ఎదుర్కోవచ్చు అని పేర్కొంటూ, గ్రామ ప్రజలు, రైతులు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకుంటే భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను కొంతవరకు తగ్గించుకోవచ్చని వివరించారు.ఈ గ్రామసభలో వ్యవసాయ శాఖ అధికారి రేణుక చౌదరి, గ్రామ ఉపసర్పంచ్ రాఘవేందర్ గౌడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రమాదేవి, వార్డు సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది, మహిళా సమాఖ్య సభ్యులు, గ్రామ యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ సీఎంవోపై పర్సంటేజీ ఆరోపణలు

తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న మౌలిక వసతుల ప్రాజెక్టుల టెండర్ల కేటాయింపులు, బిల్లుల చెల్లింపులపై అవకతవకలు, అవినీతి ఆరోపణలు గుప్పిస్తూ ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నామా రమేశ్.. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నాయకత్వానికి లేఖ రాసి దాన్ని మీడియాకు లీక్ చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ పరిధిలోని రేడియల్ రోడ్–2 ప్రాజెక్టు మూడు ప్యాకేజీల టెండర్లలో అక్రమాలు జరిగాయని ఆయన లేఖలో వివరించారు. సాధారణంగా 10 నుంచి 12 పెద్ద కంపెనీలు పాల్గొనే ఇలాంటి ప్రతిష్టాత్మక టెండర్లలో.. కేవలం నాలుగు సంస్థలు మాత్రమే పాల్గొనేలా సీఎం కార్యాలయం నుంచి ఇతర కాంట్రాక్టర్లకు బెదిరింపు ఫోన్ కాల్స్ వెళ్లాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగానే నిర్ణయించిన సంస్థలకే పనులు కట్టబెట్టేలా ముందస్తు ఒప్పందాలు కుదిరాయని అందులో పేర్కొన్నారు.ఈ టెండర్ల ప్రక్రియలో సుశీ ఇన్‌ఫ్రా సంస్థను ఉద్దేశపూర్వకంగానే డిస్క్వాలిఫై చేశారని నామా రమేశ్ లేఖలో ప్రముఖంగా లేవనెత్తారు. ఇండో–చైనా సరిహద్దు వంటి అత్యంత క్లిష్టమైన ప్రాంతాల్లో 250 కిలోమీటర్లకు పైగా రోడ్లను విజయవంతంగా నిర్మించిన అపార అనుభవం సుశీ ఇన్‌ఫ్రాకు ఉందని తెలిపారు. టెక్నికల్ ఎవాల్యుయేషన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇచ్చిన అనుభవ పత్రంపై ఎస్ఈ కౌంటర్‌సైన్ లేదనే కుంటిసాకుతో దానిని తిరస్కరించారని, ఆ తర్వాత ప్రత్యామ్నాయ పత్రాలు సమర్పించినా అధికారులు నిరాకరించారని పేర్కొన్నారు. ఎల్–1 బిడ్డర్లు నిర్దేశిత విలువ కంటే 3 నుంచి 15 శాతం అధిక ధరలను కోట్ చేయగా.. సుశీ ఇన్‌ఫ్రా కోట్ చేసిన ధరలు దాదాపు రూ.600 కోట్లు తక్కువగా ఉన్నప్పటికీ, ఆ సంస్థను పక్కనపెట్టి ప్రభుత్వ ఖజానాకు నష్టం చేకూర్చారని లేఖలో ఆరోపించారు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మధ్య ఉన్న రాజకీయ విభేదాల కారణంగానే.. రాజగోపాల్ రెడ్డి కుటుంబానికి చెందిన సుశీ ఇన్‌ఫ్రాను లక్ష్యంగా చేసుకుని ఈ అన్యాయానికి పాల్పడ్డారని పేర్కొంటూ సంస్థ ఇప్పటికే కోర్టును ఆశ్రయించిందని వెల్లడించారు.

## ఓబీసీల సమస్యలపై బండి సంజయ్‌తో చర్చ



**అగ్ని ధార న్యూస్ ,(కరీంనగర్):**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌ను తెలంగాణ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఓబీసీల సమస్యలు, హక్కులు, సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యంపై చర్చించారు. బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, ఓబీసీ మోర్చా విస్తరణ, కార్యకర్తల సమన్వయంపై సమాలోచనలు జరిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్ ఎన్నం ప్రకాష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జి పిడుగు కృష్ణ ముదిరాజ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఛార్జీల పెంపు యోచన విరమించుకోవాలి



**లేకుంటే మరో బషీర్‌బాగ్ ఉద్యమం తప్పదు**
**సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

నవంబర్ నుంచి ట్రూ అప్ ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచాలన్న రాష్ట్ర ప్రభుత్వ యోచనను వెంటనే విరమించుకోవాలని సీపీఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరో బషీర్‌బాగ్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. శుక్రవారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన సీపీఐ రామగుండం నగర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నవంబర్ నుంచి యూనిట్‌కు 30 పైసలు, డిసెంబర్ నుంచి మరో 50 పైసలు అదనంగా వసూలు చేయాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. ట్రూ అప్ ఛార్జీల పేరుతో రూ.7,635 కోట్ల భారాన్ని ప్రజలపై మోపితే సహించేది లేదన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేపట్టాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. సమావేశానికి శనిగరపు చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి గోసిక మోహన్, నగర కార్యదర్శి కె. కనకరాజ్, కార్పొరేటర్ మార్కాపురి సూర్య తదితరులు పాల్గొన్నారు.

## బాధితురాలి కి అండగా ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

వెల్దండ మండల కేంద్రానికి చెందిన నాగిళ్ల భారతమ్మ గుండెపోటుతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి భారతమ్మను పరామర్శించి, 10,000 వేల రూపాయలు అందజేశారు.ఈ కార్యక్రమంలో వెల్దండ మండల బీఆర్ఎస్ అధ్యక్షులు పుట్ట రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, జిల్లా నాయకులు నాగులు నాయక్,చెర్కూర్ సర్పంచ్ శ్రీనివాసులు,మాజీ ఎంపీటీసీ లింగం, మాజీ సర్పంచ్ అంజి నాయక్,మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్, వార్డు సభ్యులు జంగిలి సునీత, ఆనంద్, శేఖర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కొమ్ము నాగయ్య, సీనియర్ నాయకులు అంజి మాస్టర్, అశోక్ కుమార్, ప్రవీణ్, రాజు, రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేద కుటుంబానికి సిమెంట్ అందజేత



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కడ్తాల్ పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, ఆపదలో ఉన్నవారికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకుంది. కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండల పరిధిలోని కొండ్రిగానుబోడు తండా గ్రామం, పెద్దిరెడ్డి చెరువు తండాలో అసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకునేందుకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సిమెంట్‌ను అందజేశారు. రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారంతో రామావత్ కవిత, భర్త శ్రీను కుటుంబానికి ఇంటి నిర్మాణం కోసం సిమెంట్ అందించారు. సొంతింటి నిర్మాణాన్ని పూర్తి చేసుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి ఈ సహాయం ఎంతో ఉపయోగకరంగా నిలవనుంది.

**పేద కుటుంబాలకు అండగా ఉప్పల చారిటబుల్ ట్రస్ట్**

ఆర్థిక ఇబ్బందులతో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోలేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు సహాయం అందించాలనే లక్ష్యంతో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పెద్దిరెడ్డి చెరువు తండాలో అసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణానికి సిమెంట్ అందించి కుటుంబానికి అండగా నిలిచారు.సొంతింటి కలను సాకారం చేసుకోవాలనే పేద కుటుంబాల ఆశలకు తోడ్పాటునందించడం అభినందనీయమని స్థానికులు పేర్కొంటున్నారు. అవసరంలో ఉన్నవారికి సహాయం అందించడం ద్వారా సమాజంలో సేవాభావం, మానవత్వం మరింత పెంపొందుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇస్లావత్ విజేష్ నాయక్, రామావత్ శ్రీను, రామావత్ రమేష్, లోకేష్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విదేశీ విద్యానిధి దరఖాస్తుకు 31 వరకు గడువు

**అగ్ని ధార న్యూస్ ,(పెద్దపల్లి) :**



మహాత్మా జ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి పథకం దరఖాస్తు గడువును అక్టోబర్ 31 వరకు పొడిగించినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎం. రవీందర్ తెలిపారు. విదేశాల్లో మాస్టర్స్, డాక్టోరల్ విద్య అభ్యసించాలనుకునే అర్హులైన బీసీ, ఈబీసీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షల లోపు ఉండాలని, అభ్యర్థుల వయస్సు 35 ఏళ్లలోపు ఉండాలని, డిగ్రీలో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలని పేర్కొన్నారు. జీఆర్ఈలో 260, జీమ్యాట్‌లో 500 మార్కులు, టోఫెల్‌లో 60, ఐఈఎల్టీఎస్‌లో 6.0 లేదా పీటీఈలో 50 స్కోరు సాధించి ఉండాలన్నారు. పూర్తి వివరాలు, దరఖాస్తుల కోసం elanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

## జర్నలిస్టులపై దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి



**థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న ఆరోపణలపై స్వతంత్ర విచారణ జరపాలి**
**డీజేఎఫ్ (డబ్ల్యూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దార మధు**

**అగ్ని ధార న్యూస్ ,(కరీంనగర్) :**

వార్తా కథనాలు ప్రచురించినందుకు జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం, థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న ఆరోపణలు ప్రజాస్వామ్యానికి, పత్రికా స్వేచ్ఛకు విరుద్ధమని డీజేఎఫ్ (డబ్ల్యూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దార మధు అన్నారు. 'ఏక్ దమ్ న్యూస్' బ్యూరో చీఫ్ రాతిపెల్లి సంపత్, ఎడిటర్ పొత్తూరి శేఖర్‌పై పోలీసులు దాడి చేశారన్న ఆరోపణలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.శుక్రవారం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని క్రిటికల్ కేర్ బ్లాక్‌లో చికిత్స పొందుతున్న బాధిత జర్నలిస్టులను ఆయన పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దార మధు మాట్లాడుతూ.. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట ఎస్సై చొక్కాల శ్రీకాంత్‌తో పాటు ఘటనలో సంబంధం ఉన్నట్లు తేలిన పోలీసు సిబ్బందిపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరారు. విచారణ పూర్తయ్యే వరకు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను విధుల నుంచి తప్పించాలని, ఆరోపణలు నిజమని తేలితే క్రిమినల్ కేసులు నమోదు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని సీసీ కెమెరాల దృశ్యాలు, స్టేషన్ రికార్డులు, వైద్య నివేదికలు సహా కీలక ఆధారాలను భద్రపరచాలని సూచించారు. పోలీసు శాఖకు సంబంధం లేని స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలని, బాధితులకు మెరుగైన వైద్యం అందించి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని కోరారు. జర్నలిస్టులు స్వేచ్ఛగా విధులు నిర్వహించేలా రక్షణ కల్పించాలని, బాధితులకు న్యాయం జరిగే వరకు డీజేఎఫ్ (డబ్ల్యూ) అండగా నిలిచి ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం కొనసాగిస్తుందని దార మధు స్పష్టం చేశారు.

## హుస్నాబాద్‌లో నూతన కబడ్డీ అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వ జీవో జారీ

**హుస్నాబాద్** హుస్నాబాద్ నియోజకవర్గంలో క్రీడాభివృద్ధికి మరో ముందడుగు పడింది. రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ కృషితో హుస్నాబాద్ నియోజకవర్గంలో నూతన కబడ్డీ అకాడమీ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి మంజూరు చేస్తూ జీవో జారీ చేసింది.యువతలో క్రీడా ప్రతిభను వెలికితీసి, గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించాలనే లక్ష్యంతో ఈ అకాడమీ ఏర్పాటు కానుంది.కబడ్డీ అకాడమీ జీవోలోని ముఖ్యాంశాలు:హుస్నాబాద్ నియోజకవర్గం, సిద్దిపేట జిల్లాలో నూతన కబడ్డీ అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి.

# ప్రభుత్వ పాఠశాలల్లో చదివి తొలి ప్రయత్నంలోనే వైద్య విద్యకు ఎంపిక

గిరిజన కుటుంబంలో వెలిగిన విద్యా కుసుమం.. కుమారి కాట్రవత్ శ్రీవాణికి ఘన సన్మానం

**అగ్నిధార న్యూస్‌మహమ్మదాబాద్:**

పేదరికం ప్రతిభకు అడ్డుకాదని, చదువు ఎవరి సొత్తు కాదని నిరూపించింది ఓ గిరిజన బిడ్డ. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా, ప్రభుత్వ పాఠశాలల్లోనే ఒకటో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు విద్యనభ్యసించి, తొలి ప్రయత్నంలోనే వైద్య విద్యకు అవసరమైన ఎం.బి.బి.ఎస్. సీటు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచింది మహమ్మదాబాద్ మండలం శైక్పల్లి తండాకు చెందిన కుమారి కాట్రవత్ శ్రీవాణి.

కాట్రవత్ రవి, మేఘమాల దంపతుల కుమార్తె అయిన శ్రీవాణి సాధించిన ఈ విజయం ఆ కుటుంబంలోనే కాకుండా శైక్పల్లి తండా, మంగంపేట్ తండా ప్రజల్లోనూ ఆనందాన్ని నింపింది. సాధారణ కుటుంబంలో పుట్టి, పరిమిత ఆర్థిక వనరుల మధ్య చదువును కొనసాగిస్తూ వైద్య విద్యలో ప్రవేశం పొందడం ఆమె కృషికి నిదర్శనంగా నిలిచింది.

### తల్లిదండ్రుల కష్టానికి దక్కిన ప్రతిఫలం

శ్రీవాణి తల్లిదండ్రులు ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తూ, తమ కుమార్తె చదువుకు అవసరమైన సహకారాన్ని అందించారు. ఎన్నో పరిమితులు ఎదురైనా ఆమె చదువుకు ప్రాధాన్యమిస్తూ ముందుకు నడిపించారు. తల్లిదండ్రుల కష్టం, కుమార్తె పట్టుదల కలిసివచ్చి నేడు వైద్య విద్యలో సీటు సాధించే స్థాయికి చేర్చాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కూడా కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని శ్రీవాణి నిరూపించింది. పేదరికాన్ని చూసి వెనకడుగు వేయకుండా, లక్ష్యాన్ని చేరుకోవడానికి పట్టుదలతో శ్రమిస్తే విజయం తప్పక వరిస్తుందని ఆమె ప్రయాణం చాటిచెబుతోంది.

### శ్రీవాణికి ఘన సన్మానం

శ్రీవాణి తొలి ప్రయత్నంలోనే ఎం.బి.బి.ఎస్. సీటు సాధించడంతో సంతోషించిన తండా పెద్దలు, నాయకులు, యువకులు కలిసి ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీవాణి విజయానికి సహకరించిన తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో మంగంపేట్ తండా మాజీ సర్పంచ్ శ్రీ గీత పాండు, శైక్పల్లి తండా నాయక్ శ్రీ రవి నాయక్, కార్బారి శ్రీ కిషన్ నాయక్, యువజన అధ్యక్షులు కాట్రవత్ రవి నాయక్, కె. కిషన్ నాయక్, సోమల్లి బాయి, కేశలి బాయి, బెనక్య నాయక్ పాల్గొన్నారు.

అలాగే మంగంపేట్ తండా యువకులు కె. బొప్ప నాయక్, మూడవత్ పాండు నాయక్, అంగోత్ సంతోష్ నాయక్, మూడవత్ లోకేశ్ నాయక్ తదితరులు పాల్గొని శ్రీవాణిని అభినందించారు. ఆమె తల్లిదండ్రుల కృషిని కొనియాడుతూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి పేదలకు వైద్య



సేవలు అందించాలని ఆకాంక్షించారు.

### గిరిజన యువతకు స్ఫూర్తిదాయకం

శ్రీవాణి సాధించిన విజయం గిరిజన విద్యార్థులకు, పేద కుటుంబాల పిల్లలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా విద్యపై దృష్టి సారించి, లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడితే అనుకున్న గమ్యాన్ని చేరుకోవచ్చని ఆమె నిరూపించింది. ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన కుమార్తె వైద్య విద్యలో ప్రవేశం పొందడం వెనుక తల్లిదండ్రుల త్యాగం, శ్రీవాణి కృషి దాగి ఉన్నాయి. ఆమె విజయం మరెందరో విద్యార్థులకు స్ఫూర్తినివ్వాలని, గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ప్రేరణగా నిలవాలని తండా నాయకులు, యువత ఆకాంక్షించారు.

# చదువుతోపాటు క్రీడల్లోనూ సత్తా చాటాలి!

యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగాలి
బీజేపీ రాష్ట్ర నాయకుడు డా. వెన్న ఈశ్వరప్ప పిలుపు

**అగ్నిధార న్యూస్ అక్టోబర్ 16 మహమ్మదాబాద్:**

యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, సేవారత్న పురస్కార గ్రహీత డా. వెన్న ఈశ్వరప్ప పిలుపునిచ్చారు. క్రీడలు యువతలో శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా, మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను, జట్టుగా పనిచేసే తత్వాన్ని అలవర్చుతాయని పేర్కొన్నారు. మహమ్మదాబాద్ మండలం వెంకట్‌రెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ కుమ్మరి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాండ్ క్రికెట్ టోర్నమెంట్‌కు డా. వెన్న ఈశ్వరప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను కలిసి ఉత్సాహపరిచారు. క్రీడా పోటీల్లో పాల్గొంటున్న యువతను అభినందిస్తూ, క్రీడలు గెలుపోటములను సమానంగా స్వీకరించే మనస్తత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.

### యువతకు క్రీడలే బలమైన పునాది

నేటి పోటీ ప్రపంచంలో విద్య ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని ఈశ్వరప్ప పేర్కొన్నారు. చదువులో ప్రతిభ కనబరుస్తూనే క్రీడల్లోనూ తమ నైపుణ్యాన్ని నిరూపించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన ప్రోత్సాహం, అవకాశాలు లభిస్తే ఉన్నత స్థాయికి చేరుకోగలరని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని పిలుపునిచ్చారు.గ్రామస్థాయిలో క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించడం అభినందనీయమని, ఇలాంటి పోటీలు యువతలో ఐక్యతను పెంపొందించడంతోపాటు వారి ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడతాయని తెలిపారు. టోర్నమెంట్ నిర్వహించిన నిర్వాహకులకు, గ్రామ సర్పంచ్ కుమ్మరి కృష్ణకు, పాల్గొన్న క్రీడాకారులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

### క్రీడాకారుల్లో ఉత్సాహం

గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడంతో యువతలో ఉత్సాహం నెలకొంది. ఈ పోటీల ద్వారా క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం లభించింది. యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు గ్రామస్థులు, నాయకులు ముందుకు రావడం అభినందనీయమని పలువురు



పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మదాబాద్ మండల బీజేపీ అధ్యక్షుడు మూస నర్సింలు, మండల సీనియర్ నాయకుడు కురువ కృష్ణ, వెంకట్‌రెడ్డిపల్లి గ్రామ బీజేపీ సీనియర్ నాయకులు తిరుపతి రెడ్డి, స్వామి, గండీడ్ మండల మాజీ అధ్యక్షుడు ప్రభు నాయక్, గండీడ్ మండల భారతీయ జనతా యువమోర్చా అధ్యక్షుడు యాదగిరి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ యువత, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అక్రిడిటేషన్ కార్డుల జారీలో వివక్ష తగదు

సీఎం సొంత జిల్లాలో అక్రిడిటేషన్ కార్డుల కిరికిరి సిగ్గు చేటు
మహబూబ్ నగర్ జిల్లా
అక్రిడిటేషన్ కమిటీ సమావేశం వెంటనే నిర్వహించాలి

**అగ్నిధార న్యూస్‌మహమ్మదాబాద్/గండీడ్:**

టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి మొలకలపల్లి గోపాల్ మహారాజ్ డిమాండ్ మహబూబ్ నగర్ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ 4వ సమావేశం వెంటనే ఏర్పాటు చేయాలని, దరఖాస్తు చేసుకున్న అందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయడంలో వివక్ష తగదని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గండీటి నరసింహులు, జిల్లా కార్యదర్శి మొలకలపల్లి గోపాల్ మహారాజ్, కోశాధికారి ఏముల నరసింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు మూడు విడతలుగా సమావేశాలు నిర్వహించినా కొందరు సీనియర్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు కాలేదని తెలిపారు. సమాచార శాఖ అధికారి తాత్సారం, నిర్లక్ష్యం, మొండి వైఖరి కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని ఘాటుగా విమర్శించారు. 'తా పట్టిన కుందేలుకు మూడే కాళ్లు' అన్న చందంగా వ్యవహరిస్తూ గౌరవ అక్రిడిటేషన్ కమిటీ సభ్యుల అభిప్రాయాలకు విలువ ఇవ్వడం లేదనే ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని ఈ సందర్భంగా వారు కోరారు. పెండింగ్ దరఖాస్తుదారులు అందరికీ ఒకే విడతలో ఇవ్వాలని కోరారు. చిన్న పెద్ద పత్రిక చిన్న పెద్ద చానల్ అంటూ వివక్ష సరికాదని అలాగే సమాచార అధికారి తమ పట్ల వివక్ష పాటిస్తున్నారని ఎస్సీ ఎస్టీ జర్నలిస్టులు కొందరు తమ సంఘం దృష్టికి తెచ్చారని తెలిపారు. ఇలాంటి డిస్క్రిమినేషన్ సరికాదని అన్నారు. కనీసం దసరా పండుగ నాటికి దరఖాస్తు చేసుకున్న అందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేసి వారిలో సంతోషం నింపాలని ఆకాంక్షించారు.

అక్రిడిటేషన్ కార్డులు ఇస్తేనే సరైన వివరణ అవుతుంది

తమ సంఘం తరఫున ఈనెల 7న ప్రజావాణి కార్యక్రమంలో అర్హులు అందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కమిటీ చైర్మన్ గారికి వినతి పత్రం సమర్పించామని తెలిపారు. సదరు వినతికి వివరణ ఇవ్వడం మంచిదైనా అర్హులు అందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇస్తేనే సరైన వివరణ అవుతుందని తెలిపారు.

### సీఎం సొంత జిల్లాలో అక్రిడిటేషన్ కార్డుల కిరికిరి సిగ్గు చేటు

రాష్ట్ర వ్యాప్తంగా 32 జిల్లాల పరిధిలో 99శాతం అక్రిడిటేషన్ కార్డులు జారీ చేశారని, గౌరవ సీఎం రేవంత్ రెడ్డి గారి సొంత జిల్లా అయిన మహబూబ్ నగర్ జిల్లాలో నిజమైన జర్నలిస్టులకు నేటికీ అక్రిడిటేషన్ కార్డులు అందకపోవడం దురదృష్టకరమన్నారు. ఇంకా దాదాపు 200 మందికి కార్డులు మంజూరు చేయాల్సి ఉందని తెలిపారు.

### గడువు ముగిసిన బస్సు పాసు

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తీర్పు మేరకు పాత అక్రిడిటేషన్ పై జర్నలిస్టులకు జారీ చేసిన బస్సు పాసు గడువు ఈనెల 15వ తేదీతో ముగిసిందని తెలిపారు. కొత్త కార్డులు జారీ చేసి అందుబాటులోకి వచ్చేవరకు పాత అక్రిడిటేషన్ కార్డులు కలిగిన జర్నలిస్టులకు బస్సు పాసు గడువు మరోసారి



పొడిగింపు చేయాలని కోరారు. ఫ్రీలాన్స్ కేటగిరీ కోటాను ఉమ్మడి జిల్లాలకు విస్తరించాలి ఐ డి పి ఆర్ అక్రిడిటేషన్ వెబ్ సైట్ విండోలో పొందుపరిచిన ఫ్రీలాన్స్ జర్నలిస్టు కోటాను తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల కేంద్రాలకు విస్తరించాలని ఈ సందర్భంగా వారు సమాచార శాఖను డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నివాసం ఉంటూ జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్న సూపర్ సీనియర్ జర్నలిస్టులకు (25 సంవత్సరాల పైబడి) ఫ్రీలాన్స్ కేటగిరీలో అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చే విధంగా జీవోను సవరణ చేయాలని కోరారు.

### ఉద్యమ కాలం జర్నలిస్టులకు ఉచిత బస్సు పాసు సౌకర్యం కల్పించాలి

2001 నుండి 2014 వరకు తెలంగాణ ఉద్యమ సమయంలో జర్నలిజంలో కొనసాగి తెలంగాణ స్వతంత్ర ఉద్యమం కోసం పని చేసిన జర్నలిస్టులకు రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత బస్సు పాసు సౌకర్యం కల్పించాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని కోరారు.

# విద్యుత్ కోతలతో రైతులకు కన్నీరు పెట్టిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

రైతులకు 15 గంటల పాటు నిరంతర విద్యుత్ అందించాలి
బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గూడెం బాలరాజు డిమాండ్

**కామారెడ్డి :** విద్యుత్ కోతలతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడెం బాలరాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కామారెడ్డిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ వర్షాకాలంలో సన్నవరి పంట సాగు చేస్తే బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు పంట కీలక దశలో ఉన్న సమయంలో విద్యుత్ కోతలు విధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేసిందని గుర్తుచేశారు. ప్రస్తుతం బోరుబావుల వద్ద కనీసం ఎనిమిది గంటల పాటు కూడా సక్రమంగా విద్యుత్ అందడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉందని, ఈ సమయంలో పంటకు తగినంత నీరు అందించడం ఎంతో అవసరమని బాలరాజు పేర్కొన్నారు. పంట చేతికి వచ్చే కీలక సమయంలో విద్యుత్ కోతలు విధిస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కనీసం ఈ నెల రోజులైనా రోజుకు 15 గంటల



పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో దుర్గామాత పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ పూజా కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి హాజరై దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామంలో శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించారు.ఈ సందర్భంగా దుర్గామాత కమిటీ సభ్యులు గ్రామ సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమం భక్తుల సమక్షంలో ఆత్మీయంగా సాగింది. గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా భక్తిభావంతో పాటు గ్రామ ప్రజల మధ్య ఐకమత్యం, సోదరభావం మరింత బలపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, దుర్గామాత ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తి, సేవాభావం, ఐకమత్యానికి ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలందరూ కలిసికట్టుగా ఉండి గ్రామ అభివృద్ధికి సహకరించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సరస్వతి దేవిని దర్శించుకుని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన చాకలి రమేష్



**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"**

సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం సింగీతం గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి అభిషేకం,అలంకరణ సేవ,తదుపరి నైవేద్యం సమర్పణ,మహా హారతి ఇచ్చారు, ఆరవ రోజు సరస్వతి దేవి గా దర్శనమిచ్చిన దుర్గాదేవి అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు, అనంతరం హోమ కార్యక్రమాలు నిర్వహించి నవగ్రహాలకు సర్వదేవతలకు అర్చకుల స్వాహా కారాలతో అవిషులు సమర్పించారు. చాకలి రమేష్ అనే భక్తుడు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు అన్న ప్రసాదాలను వితరణ చేశారు అనంతరం ఆయనకు ఆయన సతీమణికి ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి అమ్మవారి ఆశీస్సులు మీకు ఎల్లవేళలా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు ఆలయ సన్నిధిలో సాయంత్రం అమ్మవారికి కుంకుమార్చన అర్చకుల మంత్రోచ్ఛరణలతో ఓం ఐం హ్రీం శ్రీం శ్రీమాత్రే నమః, శ్రీ సరస్వతి దేవి నమః దుర్గాదేవియై నమః సర్వ మంగల మాంగళ్యే శివే సర్వార్థ సాధకే శరణే త్రయంబకే గౌరీ నారాయణి నమోస్తుతే నమః పార్వతీ పత హర హర మహాదేవ శంభో శంకర అంటూ భక్తులతో కుంకుమార్చన చేయించారు లలిత సహస్రనామం సరస్వతి స్తోత్రం పారాయణ చేశారు అనంతరం మహిళలు, పిల్లలు భక్తి పాటలు ఆలపించారు ఈ కార్యక్రమంలో అర్చకులు మల్లికార్జున స్వామి, సంగమేశ్వర్ స్వామి, కార్తీక్ స్వామి, గ్రామ పెద్దలు,భక్తులు, మహిళలు, పిల్లలు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## జడ్డంగి సంత మార్కెట్ వద్ద కారు స్కూటీ ఢీ

ఒకరికి రక్తగాయాలు.. ధ్వంసమైన వాహనాలు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి

**రాజవొమ్మంగి :** జడ్డంగి సంత మార్కెట్ సమీపంలో కారు, మోటారు స్కూటీ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తికి రక్తగాయాలయ్యాయి. ఈ ఘటనలో స్కూటీ తీవ్రంగా ధ్వంసమవగా, కారు ముందు భాగం కూడా దెబ్బతింది. ప్రమాద స్థలంలో వాహనాల విడిభాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి.జడ్డంగి ప్రాంతంలో రోడ్డు నిర్మాణం జరిగిన తర్వాత ప్రమాదాలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంత మార్కెట్ పరిసరాల్లో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు ప్రమాదాలకు గల కారణాలను పరిశీలించి, వాహనదారులు, పాదచారుల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## శ్రీశైలంలో వైభవంగా దసరా మహోత్సవాలు కాత్యాయని అలంకారంలో శ్రీ అమ్మవారు..

శ్రీశైల దేవస్థానంలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శుక్రవారం శ్రీ అమ్మవారికి కాత్యాయని అలంకారం నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాల పూజలు, విశేష కుంకుమార్చనలు, నవావరణార్చనలు, చండీహోమం, చండీ పారాయణం, చతుర్వేద పారాయణం, కుమారీ పూజలతో పాటు రుద్రహోమం, రుద్ర పారాయణలు నిర్వహించారు.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండేళ్ల నుంచి పదేళ్లలోపు బాలికలకు పూలు, పండ్లు, నూతన వస్త్రాలు సమర్పించి కుమారీ పూజలు నిర్వహించారు. నవదుర్గల్లో ఆరవ రూపమైన కాత్యాయని దేవిని ఆరాధించడం వల్ల రోగాలు, శోకాలు, భయాలు తొలగుతాయని భక్తుల విశ్వాసం.ఈ రోజు శ్రీ స్వామిఅమ్మవార్లకు హంసవాహన సేవ నిర్వహించనున్నారు. రాత్రి 9 గంటల నుంచి అమ్మవారి ఆస్థానసేవ, సువాసినీ పూజలు, 10 గంటలకు కాళరాత్రి పూజ జరగనున్నాయి. అనంతరం వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన పుష్పపల్లకిపై శ్రీ స్వామిఅమ్మవార్లను మేళతాళాల నడుమ ఊరేగించనున్నారు. ఈ సేవలో బంతి, చామంతి, కనకాంబరం, రోజాలు, ఆర్కిడ్స్ తదితర పుష్పాలను వినియోగించనున్నారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com